డీఎంఈ కార్యాలయానికి చేరిన కేజీహెచ్ పంచాయితీ

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కింగ్ జార్జ్ ఆస్పత్రిలో రెండు రోజుల కిందట జరిగిన పంచాయితీ విజయవాడలోని డీఎంఈ కార్యాలయానికి చేరింది. కేజీహెచ్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు డాక్టర్ అశోక్‌కుమార్ రావడం, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద నిరాకరించడం చర్చనీయాంశమైంది. దీనిపై డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయ అధికారులు దృష్టి సారించినట్టు చెబుతున్నారు. సమస్యకు కారణం ఏమిటనే దానిపై ఆరా తీస్తున్నారు. డీఎంఈ కార్యాలయంలో పనిచేసే ఓ అధికారి ఇచ్చిన సమాచారంతోనే అశోక్‌కుమార్ నేరుగా ... మిగతా 6వ పేజీలో

జీవీఎంసీలో వైసీపీకి భారీ షాక్

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో కూటమి ఘన విజయం

- పది స్థానాలను కైవశం చేసుకున్న అభ్యర్థులు
- బలానికి మించి అభ్యర్థులకు పోలైన ఓట్లు
- క్రాస్ ఓటింగ్ చేసిన వైసీపీ కార్పొరేటర్లు
- ఫలించని వైవీ సుబ్బారెడ్డి బుజ్జగింపులు
- 14 బ్యాలెట్ పేపర్లపై రహస్యకోడ్‌లు వేశారని వైసీపీ అభ్యంతరం
- వాటిని చెల్లని ఓట్లుగా ప్రకటించాలంటూ ఆందోళన
- నిబంధనల ప్రకారం వీలుకాదని కమిషనర్ వివరణ
- జీవీఎంసీ వద్ద కూటమి నేతల సంబరాలు

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి):

జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీకి భారీషాక్ తగిలింది. బుధవారం జరిగిన ఎన్నికల్లో పది స్థానాలను కూటమి మద్దతుతో పోటీచేసిన టీడీపీ అభ్యర్థులు క్లీన్‌స్వీప్ చేశారు. వాస్తవంగా కూటమికి ఉన్న బలానికి మించి ఓట్లు పడడం విశేషం. కొందరు వైసీపీ కార్పొరేటర్లు తమపార్టీ అభ్యర్థులకు కాకుండా కూటమి అభ్యర్థులకు ఓటేయడం వైసీపీ నేతలను మరింత నిరాశకు గురిచేసింది.

జీవీఎంసీ కౌన్సిల్ ఏర్పడిన తర్వాత మూడుసార్లు స్టాండింగ్ కమిటీ ఎన్నికలు జరగ్గా, వైసీపీ క్లీన్‌స్వీప్ చేస్తూ వచ్చింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఘనవిజయం సాధించడంతో జీవీఎంసీలో సమీకరణాలు మారిపోయాయి. జీవీఎంసీలో మొత్తం 98 మంది కార్పొరేటర్లగానూ వైసీపీ నుంచి 21వ వార్డు కార్పొరేటర్‌గా గెలిచిన వంశీకృష్ణ శ్రీనివాస్ తనపదవికి, వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరిపోయారు. దీంతో ప్రస్తుతం 97 మంది కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. పాత స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవీకాలం గత నెలతో ముగియడంతో కొత్తగా కమిటీని ఎన్నుకునేందుకు గతనెల 22న నోటిఫికేషన్ విడుదల చేశారు. కూటమి తరఫున పది మంది, వైసీపీ నుంచి పది మంది పోటీకి నిలిచారు. నోటిఫికేషన్ విడుదలైన సమయానికి టీడీపీకి 31, జనసేనకు ఐదు, బీజేపీకి ఒకరు మొత్తంగా కూటమికి 37 మంది కార్పొరేటర్ల బలం ఉండగా.. వైసీపీకి 58 మంది సభ్యుల బలం ఉండేది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత వైసీపీ నుంచి ఆరుగురు టీడీపీలోకి ఐదుగురు జనసేనలోకి చేరిపోయారు. వైసీపీకి ఇంతకాలం మద్దతుగా నిలిచిన ఇండిపెండెంట్ కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య టీడీపీకి మద్దతు ప్రకటించారు. దీంతో కూటమి బలం 49కి పెరగ్గా, వైసీపీ బలం 47కి తగ్గింది. పోలింగ్‌కు ముందురోజైన మంగళవారం వైసీపీ ఉత్తరాంధ్ర సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి కార్పొరేటర్లతో ఒక హోటల్‌లో క్యాంప్ ఏర్పాటుచేశారు. ఈ క్యాంప్‌నకు నలుగురు కార్పొరేటర్లు డుమ్మా కొట్టడంతో వారంతా కూటమికి మద్దతు ప్రకటిస్తారని వైసీపీ నేతలు అంచనాకు వచ్చారు. బుధవారం పోలింగ్ ప్రారంభమైన తర్వాత వైసీపీ కార్పొరేటర్లు ముందుగా జీవీఎంసీలోని పోలింగ్ కేంద్రానికి ... మిగతా 6వ పేజీలో

విజేతలకు లభించిన ఓట్లు

వ.నం	పేరు	లభించిన ఓట్లు
1.	విల్లూరి భాస్కరరావు	66
2.	గొలగాని వీరారావు	65
3.	పిసిని వరాహలక్ష్మీనరసింహం	65
4.	గల్లా పోలిపల్లి	64
5.	బొమ్మిడి రమణ	64
6.	బల్ల శ్రీనివాసరావు	60
7.	శరగడం రాజశేఖర్	60
8.	నొల్లి నూకరత్న	58
9.	పులి లక్ష్మీబాయి	56
10.	పిల్లా మంగమ్మ	54



స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన కూటమి నేతలతో ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, ఇతర నేతలు





ఓటు హక్కు వినియోగించుకుంటున్న మేయర్ గొలగాని హరివెంకట కుమారి, టీడీపీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు



టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీకి మిఠాయి తినిపిస్తున్న దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

కూటమి నేతల సంబరాలు

జీవీఎంసీ ఎన్నికలు జరిగిన మూడున్నరేళ్ల తర్వాత తొలిసారి స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించడంతో కూటమి నేతలు సంబరాలు చేసుకున్నారు. ఎమ్మెల్యేలు వెలగపూడి రామకృష్ణబాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, పంచకర్ల రమేష్‌బాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, దక్షిణ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్ ఆధ్వర్యంలో నేతలు, అభిమానులు మిఠాయిలు తినిపించుకున్నారు. స్టాండింగ్ కమిటీ సభ్యులుగా భారీ మెజారిటీతో గెలుపొందినవారికి పూలమాలలు వేసి ఊరేగింపుగా తీసుకెళ్లి గ్రూప్ ఫొటోలు దిగారు.



గెలుపు సంబరాల్లో జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు

ఓషన్ డెక్ ఏర్పాటయ్యేనా?

సీఆర్‌జెడ్‌లో చిక్కుకున్న ప్రాజెక్టు ▸ ఏడాదైనా ప్రారంభం కాని పనులు



ప్రతిపాదించిన ఓషన్ డెక్ నమూనా

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) అధికారులు ఏడాది కిందట ప్రకటించిన 'ఓషన్ డెక్' ప్రాజెక్టు సీఆర్‌జెడ్ చట్రంలో ఇరుక్కుపోయింది. బీచ్ రోడ్డులోని వుడా పార్కు వెనుక పాత లైట్‌హౌస్ స్థలంలో దీనిని నిర్మించాలని అధికారులు ప్రణాళిక రూపొందించారు. పర్యాటకులను ఆకర్షించేలా ఉంటుందని ఊరించారు. విశాఖ సముద్ర తీరాన రాళ్లు అధికంగా ఉంటాయనే విషయం అందరికీ తెలిసిందే. వాటిని ఉపయోగించుకుని సముద్రంలోపలికి చొచ్చుకు వెళ్లేలా 100 మీటర్ల పొడవున డెక్ నిర్మాణానికి డిజైన్ తయారుచేశారు. ఆ డెక్ తీరాన 50 మీటర్లు, మిగిలిన 50 మీటర్లు సముద్రంలో ఉండేలా రూపొందించారు. గ్రౌండ్ ప్లస్ ఫస్ట్ ఫ్లోర్ భవనంలా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. డెక్ నుంచి సముద్రం లోపలికి నడుచుకుంటూ వెళ్లి అక్కడ హాయిగా కూర్చొని నచ్చిన ఆహారం తీసుకునేందుకు వీలుగా రెస్టారెంట్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. పై ఫ్లోర్‌ని వ్యూ పాయింట్‌గా తీర్చిదిద్ది సందర్శకులు సముద్రం, పరిసర ప్రాంతాలను చూసేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. వ్యాపారం బాగా జరగడానికి అక్కడి ఆహారాన్ని 'టేక్ ఎవే' విధానంలో రెస్టారెంట్ నుంచి తీసుకెళ్లేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.7.8 కోట్లు వ్యయమవుతుందని గత ఏడాది జూలైలో ప్రకటించారు. కేవలం తొమ్మిది నెలల్లో పూర్తిచేసి పర్యాటకులకు అందుబాటులోకి తీసుకువస్తామని నాటి వీఎంఆర్‌డీఏ ఇన్‌చార్జి కమిషనర్, సీతః శివప్రసాద్ రాజు ప్రకటించారు. టెండర్లు పిలిచి పనులు ఖరారు కూడా చేసేశారు.

పరిశీలనకు చెన్నై

సాగరతీరాన ఏదైనా ప్రభుత్వ, ప్రైవేటు ప్రాజెక్టు నిర్మించాలంటే కోస్తా నియంత్రణ మండలి (సీఆర్‌జెడ్) అనుమతి అవసరం. రాష్ట్రంలో ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఏపీసీజెడ్ఎంఏ)కి నివేదిక పంపుతారు. అక్కడ బోర్డు సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటారు. ప్రాజెక్టు వివరాలు తీసుకుని, దాని అవసరం ఏమిటో ప్రశ్నించి ... మిగతా 6వ పేజీలో

మారని కోర్బా తీరు!

గంట ఆలస్యంగా విశాఖ చేరిక

- ఉదయం 11 గంటల వరకు అదే ప్లాట్‌ఫారంపై నిలిపివేత
- 'ఆంధ్రజ్యోతి' పరిశీలనలో వెల్లడి

ఆంధ్రజ్యోతి పరిశీలన



ఉదయం 11 గంటల వరకు కదలని కోర్బా ఎక్స్‌ప్రెస్



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

కోర్బా- విశాఖపట్నం, విశాఖపట్నం- తిరుపతి మధ్య నడిచే కోర్బా ఎక్స్‌ప్రెస్ రైలు నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. మూడు రోజుల క్రితం (ఆదివారం) కోర్బా నుంచి విశాఖపట్నం చేరిన ఈ రైలు ప్లాట్‌ఫారంపై ఆగి ఉండగా ఏసీ కోచ్‌లలో మంటలు చెలరేగి బీ-7 కోచ్, పూర్తిగా, బీ-6 కోచ్ పాక్షికంగా దగ్ధమైన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదం ఎలా జరిగిందో తెలుసుకోవడానికి రైల్వే అధికారులు ఉన్నతస్థాయి కమిటీని వేశారు. పలు నగరాల నుంచి అధికారులు వచ్చి మూడు రోజులుగా పరిశీలిస్తున్నారు. కానీ వారికి ఎటువంటి ఆచూకీ లభించలేదు. ఆదివారం ఉదయం 6.45 గంటలకు నాలుగో నంబరు ప్లాట్‌ఫారంపైకి వచ్చిన రైలును వెంటనే కోచింగ్ కాంప్లెక్స్‌కు పంపలేదు. దాంతో 9.45 గంటల సమయంలో మంటలు చెలరేగి కోచ్‌లు అంటుకున్నాయి. ఇదే రైలు ఒంటిగంటకు 'కడప' బోర్డు తగిలించుకొని తిరుపతి వెళ్లడానికి ప్లాట్‌ఫారంపైకి రావాల్సి ఉంది. ఈలోగా కోచింగ్ కాంప్లెక్స్‌లో శుభ్రం చేయాల్సి ఉంది. సమన్వయ లోపం, నిర్లక్ష్యం కారణంగా రైలును ప్లాట్‌ఫారంపైనే ఉంచేయడంతో ప్రమాదం జరిగింది. దీనికి కారణాలు ఇప్పటికీ వెల్లడి కాలేదు.

'ఆంధ్రజ్యోతి' పరిశీలన

కోర్బా ఎక్స్‌ప్రెస్ నిర్వహణ ఎలా ఉందో తెలుసుకోవడానికి బుధవారం 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నం చేసింది. ఉదయం ఆరు గంటలకే స్టేషన్‌కి చేరుకుని రైలు రాక కోసం వేచి చూసింది. కోర్బాలో మంగళవారం సాయంత్రం బయల్దేరిన ఈ రైలు బుధవారం ఉదయం 6.25 గంటలకు విశాఖ చేరాల్సి ఉండగా 7.45 గంటలకు ఐదో నంబరు ప్లాట్‌ఫారంపైకి వచ్చింది. ప్రయాణికులు మొత్తం పావుగంటలో దిగిపోయారు. ఆ తరువాత రైల్వే సిబ్బంది వచ్చి రిజర్వేషన్ బోగీలలో బెడ్‌షీట్లు, తలగడలు వంటి సామగ్రి దించారు. ఈ ప్రక్రియ 9 గంటలకు పూర్తయింది. దీనిని కోచింగ్ కాంప్లెక్స్‌కు తరలించి శుభ్రం చేసి, తిరిగి స్టేషన్‌కి తీసుకురావాల్సి ఉండగా ఉదయం 11 గంటల వరకు అదే ప్లాట్‌ఫారంపై ఉంచేశారు. ఎందుకు అలా చేశారని ఆరా తీస్తే... తిరుపతి రైలును రద్దు చేసినందున ఈ రైలు పంపాల్సిన అవసరం లేదని, అందుకే ఉంచేశారని తెలిసింది.

సమన్వయంపై అనుమానాలు

విశాఖపట్నంతో ప్రయాణం ముగించుకొని, తిరిగి ఇక్కడి నుంచి బయల్దేరాల్సిన రైళ్లను కోచింగ్ కాంప్లెక్స్‌కు పంపించి శుభ్రం చేస్తారు. స్టేషన్‌మాస్టర్, కోచింగ్ కాంప్లెక్స్ ఏఓఎం వీటిపై నిర్ణయం తీసుకుంటారు. ముందుగా పంపాల్సిన రైళ్లను ప్రాధాన్యత ప్రకారం కోచింగ్ కాంప్లెక్స్‌కు పంపుతారు. అలాగే ఇక్కడ స్టేషన్‌కు వచ్చే రైళ్లకు క్లియరెన్స్ ఇవ్వడానికి ప్లాట్‌ఫారాల లభ్యతను బట్టి స్టేషన్ మాస్టర్ ఏ రైలు ఎంత సేపు ఏ ప్లాట్‌ఫారంపై ఉంచవచ్చునో నిర్ణయం తీసుకుంటారు. అయితే ఏ రైలును గంటల కొద్దీ ప్లాట్‌ఫారాలపై ఉంచకూడదు. కానీ కోర్బా రైలు ప్రతి రోజూ విశాఖ చేరుకున్నాక కనీసం మూడు గంటల కంటే ఎక్కువ సమయం స్టేషన్‌లోనే ఉంటోంది. మిగిలిన రైళ్ల విషయంలోను అధికారులు ఇలాగే వ్యవహరిస్తున్నారా? లేదా? అని పరిశీలిస్తే గానీ తెలియదు. ఈ అంశాలపై ఏ అధికారీ పెదవి విప్పడం లేదు. వ్యవహారాలన్నీ రెండు మూడు విభాగాలతో ముడిపడి ఉండటంతో అందరూ తప్పునకు దొరికిపోతారని రైళ్ల నిర్వహణ గురించి చెప్పడం లేదు.

కారణాలు చెప్పే సంప్రదాయమే లేదు

రైల్వేలో ఎప్పటికప్పుడు ప్రమాదాలు సంభవిస్తున్నాయి. పట్టాలు తప్పడం, ఒకే ట్రాకుపై రైళ్లు వచ్చేసి ఢీకొట్టడం, అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఒక్కోసారి ప్రయాణికులు మృతిచెందుతున్నారు. ఇలాంటి ఘటనలపై వెంటనే కమిటీలను వేసి విచారిస్తామని అధికారులు ప్రకటించడం మినహా విచారణలో ఏమి ... మిగతా 6వ పేజీలో

రెపె ఛేజ్ హీట్స్‌లో ఎర్రాజీ జ్యోతి

సెమీఫైనల్స్‌కు చేరే అవకాశం

విశాఖపట్నం (స్పోర్ట్సు), ఆగస్టు 7:



పారిస్ విశ్వ క్రీడల మహిళల 100 మీటర్ల హర్డిల్స్ రేస్‌లో విశాఖకు చెందిన అంతర్జాతీయ అథ్లెట్ ఎర్రాజీ జ్యోతికి మరో సువర్ణ అవకాశం లభించింది. బుధవారం జరిగిన 100 మీ. హర్డిల్స్ తొలి రౌండ్ హీట్స్-4 పాల్గొన్న జ్యోతి ఏడో స్థానంతో నిరాశపరిచింది. దీంతో సెమీ ఫైనల్స్‌కు నేరుగా అర్హత సాధించలేక పోయింది. అయితే గురువారం జరగనున్న రెపెచేజ్ హీట్-1లో పోటీపడే అవకాశం దక్కింది. (ఇంటర్నేషనల్ కెరీర్‌లో అత్యుత్తమ టైమింగ్ నెలకొల్పిన అథ్లెట్లకు సెమీస్‌కు చేరేందుకు టెక్నికల్ కమిటీ కల్పించే ఈ అవకాశాన్ని రెపె ఛేజ్ అంటారు). ఈ హీట్-1లో జ్యోతితో కలిపి ఎనిమిది మంది పోటీపడనున్నారు.

13.16 సెకన్లలో రేస్ పూర్తి

బుధవారం జరిగిన రౌండ్-1 హీట్-4 జమైకా, ఐర్లాండ్, స్విట్జర్లాండ్, రష్యా, ఫ్రాన్స్, హంగేరి, వెనుజులాకు చెందిన బలమైన ప్రత్యర్థులతో పోటీపడిన జ్యోతి ఆశించిన స్థాయిలో రాణించలేదు. ఈ హీట్స్‌లో ఎనిమిది మంది పోటీపడగా జ్యోతి ఏడోస్థానంలో నిలిచింది. తొలిస్థానం సాధించిన డేనియల్ విలియమ్స్ (జమైకా) తన రేసును 12.59 సెకన్లలో పూర్తిచేయగా ఏడోస్థానంలో నిలిచిన ఎర్రాజీ జ్యోతి 13.16 సెకన్లలో పూర్తి చేసింది. ఒలింపిక్స్ ముందు చైనాలోని చెంగుడులో జరిగిన సీజన్ మీట్‌లో 12.78 సెకన్ల టైమింగ్‌తో అద్భుత ఫాంలో ఉన్న జ్యోతి ఒలింపిక్స్ హీట్స్‌లో 100మీ. హర్డిల్స్‌కు 13.16 సెకన్ల సమయం తీసుకుంది. కాగా గురువారం జరిగే రెపె ఛేజ్‌లో రాణించాలని క్రీడా ప్రతినిధులు ఆశిస్తున్నారు.

స్కూల్ కమిటీ ఎన్నికలకు ఈసీ గ్రీన్ సిగ్నల్

జిల్లాలో 596 ప్రభుత్వ పాఠశాలలు

- మొత్తం 77 వేల మంది విద్యార్థులు
- ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులు
- కమిటీ చైర్మన్, వైస్‌చైర్మన్లను ఎన్నుకోనున్న సభ్యులు
- 50 శాతం విద్యార్థుల తల్లిదండ్రుల హాజరు తప్పనిసరి

విశాఖపట్నం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)లకు గురువారం నిర్వహించనున్న ఎన్నికలకు ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలతో కోడ్ అమలులో ఉంది. ఈ నేపథ్యంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నిర్వహణపై అనుమతి కోసం జిల్లా యంత్రాంగం రాసిన లేఖకు ఈసీ బుధవారం సాయంత్రం అనుమతి ఇవ్వడంతో ఉత్కంఠకు తెరపడింది. దీంతో గురువారం జిల్లాలో 596 పాఠశాలల్లో ఎన్నికలు విద్యాశాఖ ఏర్పాట్లుచేసింది.

జిల్లాలో 451 ప్రాథమిక, 154 ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో జూలై 31వ తేదీనాటికి రిజిస్టర్‌లో నమోదైన విద్యార్థుల సంఖ్య 77వేలుగా ఉంది. దీని ప్రకారం ఆయా విద్యార్థుల తల్లిదండ్రులకు ఓటు హక్కు ఉంటుంది. ప్రతి పాఠశాలలో గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎన్నికల ప్రక్రియ చేపడతారు. మధ్యాహ్నం 2.30 గంటలకు పాఠశాల యాజమాన్య కమిటీ సమావేశాలు ... మిగతా 6వ పేజీలో



ప్రజా ప్రయోజనాలకనుగుణంగా స్మార్ట్ సిటీ పనులు: కలెక్టర్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట, ఆగస్టు 7: ప్రజా ప్రయోజనాలకనుగుణంగా గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ పనులు చేపట్టాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యకలాపాలు, అభివృద్ధి ప్రాజెక్టులపై కలెక్టర్ బుధవారం సమీక్షించారు. కలెక్టరేట్‌లోని స్మార్ట్ సిటీ కార్పొరేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ఇప్పటి వరకు చేపట్టిన పనులు, భవిష్యత్తు ప్రాజెక్టులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర సుందరీకరణ దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తుప్రాజెక్టులు చేపట్టాలని సూచించారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్లు కొన్ని అంశాలు యథావిధిగా ఆమోదించగా, మరికొన్నింటిపై మార్పులు సూచించారు. నగరం లో ముఖ్య కూడళ్లలో అభివృద్ధి, సుందరీకరణ, తాగునీటి సదుపాయం మెరుగుదల, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై దృష్టిసారించి పనులు వేగవంతం చేయాలని ఈ సందర్భంగా పలువురు డైరెక్టర్లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విఠల్ కుమార్, సెక్రటరీ కుసుమాంబ, పోలీసు కమిషనర్ శంఖబ్రాత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్, ఏపీ ఈపీడీఎస్ఎల్ సీఎండీ పృథ్వీతేజ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

టర్నర్ చౌల్ట్రీ వద్ద ఆక్రమిత స్థలం స్వాధీనం


ఆక్రమణలు తొలగింపుతో విశాలంగా మారిన రస్తా

జగదాంబ కూడలి, ఆగస్టు 7: వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీ దరి మెయిన్‌రోడ్డు వద్ద జీవీఎంసీ ఆక్రమిత స్థలాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గత 30 ఏళ్లకు పైగా ఇక్కడి జీవీఎంసీ మార్గాన్ని ఓ వస్త్రవ్యాపారి ఆక్రమించి వ్యాపారాన్ని సాగిస్తున్నారు. టర్నర్‌చౌల్ట్రీ ప్రహరీ మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్ నుంచి దాదాపు ఆరడగులు పొడవు, 20 అడుగుల వెడల్పున గల రహదారి మార్గం ఆక్రమించారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 5వ తేదీన 'జీవీఎంసీ స్థలం ఆక్రమణ' శీర్షికన కథనం ప్రచురించింది. ఈ స్థితిలో జోనల్ కమిషనర్ ప్రసాద్ ఆదేశాలతో అసిస్టెంట్ సిటీప్లానర్, సిబ్బంది రెండురోజులుగా పూర్తిస్థాయిలో ఆక్రమణలను తొలగించారు. ఇక్కడ రాకపోకలకు వీలుగా రహదారి ఏర్పాటు చేయాలని స్థానికులు కో రుతున్నారు. ఇంతవరకు జీవీఎంసీ ఈ ఆక్రమిత స్థలానికి నామమాత్రంగా పన్ను వసూలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జగదాంబ నుంచి పూర్ణామార్కెట్ వరకు ప్రత్యేక దృష్టి సారిస్తే మరిన్ని ఆ క్రమణలు బయటపడతాయని పలువురు కోరుతున్నారు.

మహిళా కళాశాలలో చేనేత దినోత్సవం


కార్యక్రమంలో చేనేత వస్త్ర ధారణలో విద్యార్థినులు

జ్ఞానాపురం, ఆగస్టు 7: సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హోం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం చేనేత దినోత్సవం నిర్వహించినట్టు విభాగాధిపతి సోని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేనేత వస్త్రాలపై అవగాహన కలిగేలా రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శించారు. పోచంపల్లి, గద్వాల్, మంగళగిరి, గుంటూరు, వెంకటగిరి, కంచి, నారాయణపేట చేనేత వస్త్రాలను ధరించి వాటి ప్రత్యేకతను వివరించారు. అనంతరం నిర్వహించిన ఫ్యాషన్ వాక్‌లో విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా డాక్టర్ లక్ష్మీప్రభ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతగా డాక్టర్ పీకే జయలక్ష్మి వ్యవహరించారు. చేనేత మన సంస్కృతి అని..చేనేత కార్మికులను ఆదరించడం మన కర్తవ్యమని అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నివ్య శ్రీజ, గాయత్రి, దీపాలి పాల్గొన్నారు.

టమాటా కోసం బారులు


సీతమ్మధార రైతుబజారులో కొనుగోలుదారులు

సీతమ్మధార, ఆగస్టు 7: సీతమ్మధారలోని రైతుబజార్‌లో బుధవారం టమాటా కోసం జనం బారులు తీరారు. మంగళవారం సెలవు కావడంతో హోల్‌సేల్ మార్కెట్ నుంచి వ్యాపారులు టమాటా తేవడం ఆలస్యమైంది. దీంతో బజార్‌కి వచ్చే కొనుగోలుదారులు నిరీక్షించాల్సి వచ్చింది. నగరంలో పెద్ద బజార్‌లుగా పేరొందిన ఎంవీపీ కాలనీ, అక్కయ్యపాలెం రైతుబజార్ బుధవారం సెలవు కావడంతో అధిక సంఖ్యలో జనం సీతమ్మధారకు వచ్చారు. దీంతో బజార్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి టమాటా విక్రయించేలా బజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకులు సతీష్ చర్యలు చేపట్టారు. కిలో రూ.27 చొప్పున విక్రయించారు.

కళ్ల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

డాబాగార్డెన్స్, ఆగస్టు 7: బాల్యం నుంచే కళ్లపై శ్రద్ధ ఎంతో అవసరమని రమాదేవి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ అన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డు జీవీఎంసీ ఆర్‌బీయూపీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ప్రాంతీయ కంటి ఆస్పత్రి వైద్యులు ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వైద్య పరీక్షలను నిర్వహించారు. పౌష్టిహాకారం తీసుకోవడంతోపాటు చదువుకునే సమయంలో కళ్లను నీటితో శుభ్రం చేసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకరాజు, రాంబాబు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టీల పేరిట టోకరా

» పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు


చిటీల నిర్వాహకురాలి ఇంటి సమీపంలో నిరసన తెలుపుతున్న బాధితులు

పెందుర్తి, ఆగస్టు 7: పెందుర్తిలో మరో మహిళ చిట్టీల పేరిట మోసం చేసిన ఘటన వెలుగుచూసింది. రూ.కోట్లలో లావాదేవీలు నిర్వహించి, ముఖం చాటేయడంతో బాధితులు చిట్టీ నిర్వాహకురాలి ఇంటి సమీపంలో బుధవారం నిరసన తెలిపారు. బాధితులు, సీఐ ఎల్. రామకృష్ణ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తిలోని గాంధీనగర్ సమీపంలో ఉంటున్న కంచి మాధవి పదేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తున్నారు. ఆమె తండ్రి, భర్త రియల్ ఎస్టేట్, కనస్ట్రక్షన్ వ్యాపారం నిర్వహిస్తూ పెందుర్తిలో సుపరిచితులు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న పలుకుబడిని ఆసరాగా చేసుకుని మాధవి చీటీలు వేశారు. ఈ క్రమంలో పలువురు చిట్టీలు కట్టారు. కొంతకాలం ఈ వ్యాపారం సజావుగా కొనసాగడంతోనమ్మకం కుదిరి మరింత మంది చేరారు. సంక్రాంతి, దసరా చీటీలు, శ్రావణమాసం గోల్డెన్ డ్రా చీటీల పేరిట మాధవి సొమ్ము కట్టించుకున్నారు. దీనికితోడు కమీషన్ ఆశ చూపి ఏజెంట్లతోనూ ఆమె చిట్టీల పేరిట కోట్లలో వ్యాపార లావాదేవీలు సాగించినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. ఏడాదిగా ఆమె చిట్టీల సొమ్ములు చెల్లించచడంలేదు. దీంతో ఈ విషయంపై ఆమె తండ్రి సిల్లా ప్రసాదరావు వద్ద పంచాయితీ పెట్టగా త్వరలో బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా.. అది నెరవేరలేదని పలువురు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పలువురు బాధితులు కంచి మాధవి ఇంటి సమీపంలో న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు.

రూ. 3. 50 కోట్ల మోసం

చిట్టీల పేరిట రూ 3.5 కోట్లు మోసం జరిగిందని పెందుర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందినట్టు సీఐ రామకష్ణ తెలిపారు. అయితే, బాధితులు మాత్రం రూ. 15 కోట్లు వరకు ఉంటుందని అంటున్నారు. తమకు ఆధారాలతో రూ. 3.5 కోట్లు మోసం జరిగి నట్టు గుర్తించామని, దీనిపై నిందితురాలు మాధవితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఆగస్టు 7: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో విద్యుత్ ఫీడర్స్ మరమ్మతు పనుల చేపడుతున్నందున గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ -1 ఎలక్ట్రికల్ ఈఈ బి.సింహాచలం తెలిపారు. సీతమ్మధార ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఎదురు ప్రాంతం, ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్ రోడ్డు, మోర్ సూపర్‌మార్కెట్, బాలయ్యశాస్త్రి లే అవుట్, సీతమ్మధార వినియోగదారులు గమనించాలని కోరారు.

అక్కయ్యపాలెం పరిధిలో రేపు..

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. శంకువానిపాలెం, సరోజిని హాస్పిటల్, జగ్గారావు బ్రిడ్జి ఏరియా, ఎనభై అడు గుల రోడ్డు, చిన్నూరు, జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

సచివాలయంలో జడ్సీ తనిఖీ


హాజరు పట్టిక పరిశీలిస్తున్న జడ్సీ కృష్ణ

జ్ఞానాపురం, ఆగస్టు 7: గ్రేటర్ 53వ వార్డు పరిధి 295 నంబరు సచివాలయాన్ని జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్‌వీ కృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పరిశీలించారు. ప్రజలకందిస్తున్న సేవల్లో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సూపరింటెండెంట్ టీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెంలో చెత్త తొలగింపు

అక్కయ్యపాలెం, ఆగస్టు 7: తాటిచెట్లపాలెం ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు ఎక్సవేటర్‌తో బుధవారం తొలగించారు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ కొండవాలు ప్రాంతాలను పర్యటించారు. అక్కడ చెత్త కుప్పలు దర్శనమివ్వడంతో వాటిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. దీంతో ఆ చెత్త కుప్పలకు విముక్తి కలిగింది.

మారని కోర్బా తీరు!

... 5వ పేజీ తరువాయి

తేలింది? ఎవరి తప్పు వల్ల ప్రమాదం జరిగింది? ఎటువంటి చర్యలు తీసుకున్నారనే వివరాలు వాల్తేరు డివిజన్ అధికారులు బయట పెట్టడంలేదు. ఇటీవల కంటకాపల్లిలో ఆగిఉన్న ప్రయాణికుల రైలును వెనుక నుంచి మరో రైలు వచ్చి ఢీకొట్టింది. ఇందులో అనేక సాంకేతిక లోపాలపై చర్చ జరిగింది. అయితే ప్రమాదానికి అసలు కారణమేమిటనేది ఇప్పటివరకు ప్రకటించలేదు. కానీ కొందరు స్టేషన్ మాస్టర్లను బదిలీ చేసి చేతులు దులుపుకొన్నారు. అలాంటి ప్రమాదం జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారో కూడా చెప్పలేదు.

కోర్బా అగ్నిప్రమాదం కూడా అలాగే మిగిలిపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లో పొగలు, మంటలు వస్తే స్మోక్ సెన్సార్లు ఎందుకు పనిచేయలేదనే అంశంపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. మాక్ డ్రిల్ తరహాలోనైనా ఏదైనా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లో పొగపెట్టి అలారం మోగించి, సహాయక చర్యలు చేపడితే ప్రయాణికులకు కొంత అవగాహన, నమ్మకం ఏర్పడతాయి. అంతేకాదు ప్రమాదం జరిగిన తరువాతైనా మంటలు వ్యాపింపజేసే సరకుల రవాణా జరుగుతుందేమో తెలుసుకోవడానికి తనిఖీలు చేయాల్సి ఉంది. మూడు రోజులు దాటినా అటువంటి తనిఖీలు లేవు.

జీవీఎంసీలో వైసీపీకి భారీ షాక్

... 5వ పేజీ తరువాయి

చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. తర్వాత వైసీపీ క్యాంప్‌నకు గైర్హాజరైన నలుగురు కార్పొరేటర్లు కూటమి కార్పొరేటర్లతో కలిసి బస్సులో జీవీఎంసీకి చేరుకోవడంతో వైసీపీ నేతలు అవాక్కయ్యారు.

అంచనాకు మించి ఓట్లు

మధ్యాహ్నం రెండు గంటలకు పోలింగ్ ముగియడంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. అయితే అంచనాకు మించి కూటమి అభ్యర్థులకు ఓట్లు రావడంతో కూటమినేతలతోపాటువైసీపీనేతలను సైతం ఆశ్చర్యపోయారు. కూటమికి 54 మంది కార్పొరేటర్లు బలం ఉంటే వారిలో ఒకరికి 66 ఓట్లు, ఇద్దరికి 65 ఓట్లు, మరో ఇద్దరికి 64 ఓట్లు, ఇంకో ఇద్దరికి 60 చొప్పున ఓట్లు రావడం విశేషం. మరోవైపు వైసీపీకి 43 మంది కార్పొరేటర్ల బలం ఉన్నప్పటికీ ఆపార్టీ నుంచి పోటీచేసిన అభ్యర్థుల్లో బిపిన్‌జైన్‌కు 21, కరణాడ వెంకట నాగశశికళకు 25, పల్లా అప్పలకొండకు 32, ముర్రువాణికి 36, తోటపద్మావతికి 36, మహ్మద్ ఇమ్రాన్‌కు 36 ఓట్లు వచ్చాయి. ఆపార్టీనుంచి పోటీచేసిన సాడి పద్మారెడ్డికి మాత్రమే గరిష్టంగా 42 ఓట్లు పడ్డాయి. దీనినిబట్టి వైసీపీ కార్పొరేటర్లు కూటమి అభ్యర్థులకు ఓటేసినట్టు తేటతెల్లమైంది.

వైసీపీ నేతల ఆందోళన

కూటమి అభ్యర్థులకు పోలైన ఓట్లలో 14 బ్యాలెట్ పేపర్లపై పెన్ను, పెన్సిళ్లతో ప్రత్యేకంగా కోడ్ వేసి ఉన్నాయంటూ వైసీపీ నేతలు అభ్యంతరం వ్యక్తంచేశారు. బ్యాలెట్‌పత్రాలపై పెన్ను, పెన్సిళ్లతో ఎలాంటి గీతలు ఉండకూడదని, ఒకవేళ అలా ఉంటే వాటిని చెల్లని ఓట్లుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనికి అధికారులు ససేమిరా అనడంతో ఓట్ల లెక్కింపు కేంద్రం బయట ఆందోళనకు దిగారు. అప్పటికే జీవీఎంసీ కార్యాలయం ఆవరణలో ఉన్న డిప్యూటీ మేయర్ కట్టమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, మొల్లి అప్పారావు, పల్లా దుర్గారావు అధికారులు నిబంధనలను పక్కనపెట్టి అధికారపార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. వారంతా కమిషనర్ పోర్టికో వద్ద బైఠాయించి పోలీసులకు, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. దీంతో పోలీసులు జోక్యంచేసుకుని ఆందోళన విరమింపజేసేందుకు యత్నించినా, తమకు కమిషనర్ వివరణ ఇవ్వాలని పట్టుబట్టడంతో ఏసీపీ సీహెచ్ వివేకానంద కమిషనర్ సంపత్‌కుమార్ వద్దకు వారిని తీసుకెళ్లారు. నిబంధనల్లో ఎక్కడా పెన్ను, పెన్సిల్, రహస్యకోడ్ ప్రస్తావనగానీ లేనందున, వాటిని చెల్లనిఓట్లుగా ప్రకటించడం సాధ్యం కాదని ఆయన వివరించారు. అయినప్పటికీ సంతృప్తి చెందక ఆందోళన కొనసాగించడంతో పోలీసులు వారిని బలవంతంగా బయటకు తరలించారు.

ఓషన్ డెక్ ఏర్పాటయ్యేనా?

... 5వ పేజీ తరువాయి

ఇతర సంస్థల సూచనలు, సలహాలు తీసుకున్నాకే అనుమతి ఇస్తారు. ఇదంతా పూర్తికావడానికి ఏడాదికి పైగానే సమయం పడుతుంది. ఈ విషయం వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులకు కూడా తెలుసు. అయినా సరే తొమ్మిది నెలల్లో పూర్తిచేస్తామని ప్రకటించారు. అనుమతి కోసం ఏపీసీజెడ్ఎంఏకి లేఖ రాస్తే, వారు రెండుసార్లు వివరాలు తీసుకుని, చెన్నైలోని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చి సంస్థ పరిశీలనకు పంపించారు. సాగర తీరాన అలాంటి ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే పర్యావరణ ప్రభావం, అనుమతి ఇవ్వచ్చా? లేదా? అని సలహా కోరారు. కానీ ఇంకా సమాధానం రాలేదు.అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే తప్ప ఇక్కడ పనులు ప్రారంభమయ్యే అవకాశం లేదు. అయితే ఇలాంటి అనుమతులు పొందాలంటే ఆ అధికారులను కలిసి ఒప్పించాల్సి ఉంటుందని, వీఎంఆర్‌డీఏ అధికారులకు అంత తీరక లేక వెళ్లడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే ఏడాది దాటింది. మరికొంత కాలం గడిస్తే ప్రాజెక్టు విషయాన్ని అందరూ మరచిపోతారు. కమిషనర్లు మారితే పాత ప్రాజెక్టులకొనసాగింపు, పునరుద్ధరణపై వీఎంఆర్‌డీఏ ఎప్పుడూ దృష్టి పెట్టడం లేదు.దీంతో ఇది కూడా కాలగర్భంలో కలిసిపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్కూల్ కమిటీ ఎన్నికలకు ఈసీ గ్రీన్ సిగ్నల్

... 5వ పేజీ తరువాయి


నిర్వహించనున్నారు. ఎన్నిక నిర్వహించాలంటే ప్రతి పాఠశాలలో 50 శాతం మంది తల్లిదండ్రులు హాజరుకావాలి. అంతకంటే తక్కువగా హాజరైతే కోరం లేదని వాయిదా వేస్తారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. ఎన్నిక అనివార్యమైతే ప్రతి తరగతిలోని విద్యార్థుల తల్లిదండ్రులు చేతులెత్తి సభ్యులను ఎన్నుకునే విధానం అమలుచేస్తారు. తరువాత సభ్యులు అంతా కలిసి చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ప్రాథమిక పాఠశాలలో 15 మందితో కమిటీ ఉంటుంది. యూపీ పాఠశాలలో ఒకటి నుంచి ఏడోతరగతి వరకు ఉంటే 21 మంది, ఎనిమిదోతరగతి ఉంటే 24 మందితో కమిటీ ఏర్పాటవుతుంది. మూడోతరగతి నుంచి పదోతరగతి వరకు ఉన్న పాఠశాలల్లో 24 మంది, ఆరో తరగతి నుంచి పది వరకు ఉంటే 15 మందితో కమిటీ ఏర్పడుతుంది. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులకు జిల్లా విద్యాశాఖ లేఖ రాసింది. పెద్ద పాఠశాలల్లో బందోబస్తు అవసరమని ప్రతిపాదించింది. ఎన్నికల నిర్వహణను ప్రతి మండలంలో తహసీల్దారు, ఎంపీడీవోలు పర్యవేక్షించనున్నారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లుచేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులకు ఇప్పటికే సూచనలు జారీ చేశామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

డీఎంఈ కార్యాలయానికి కేజీహెచ్ పంచాయితీ

... 5వ పేజీ తరువాయి

కేజీహెచ్‌కు వెళ్లారని, ఉత్తర్వులు విడుదల కాకముందే అలా చెప్పాల్సిన అవసరం ఏమిటనే దానిపై ఆ అధికారిని వివరణ కోరినట్టు తెలిసింది. ఇదిలా, ఉండగా డాక్టర్ అశోక్‌కుమార్ విజయవాడ వెళ్లి డీఎంఈతోపాటు ఇతర ఉన్నతాధికారులను కలిశారని, సెలవులు ముగిసిన నేపథ్యంలో విధుల్లో చేరతానని, ఈ మేరకు మెయిల్ చేసిన వివరాలు చర్చించినట్టు చెబుతున్నారు. అయితే అశోక్‌కుమార్‌కు మళ్లీ కేజీహెచ్ బాధ్యతలను అప్పగిస్తారా..? లేక మరోచోట నియమిస్తారా, అతనిపై ఉన్న కేసు విచారణ పూర్తయ్యే వరకు పెండింగ్‌లో పెడతారా..? అనేది తేలాల్సి ఉంది.

శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు దోహదం


మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన సమావేశంలో వైద్యులు, సిబ్బంది

మహారాణిపేట, ఆగస్టు 7: నవజాత శిశువులు ఆరోగ్య రక్షణకు తల్లిపాలు ఎంతో దోహదపడతాయని ప్రముఖ నవజాత శిశువుల వైద్య నిపుణుడు శ్యామ సునీల్ కిశోర్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం మహారాణిపేటలో మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ ఆసుపత్రిలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలలో ఎన్నో పోషకాలు ఉంటాయని, తల్లిబిడ్డకు చక్కని ప్రేమ బంధాన్ని పెంపొందిస్తామని పేర్కొన్నారు. మన దేశంలో బ్రెస్ట్ ఫీడింగ్ రేట్ చాలా తక్కువగా ఉందన్నారు. సహజసిద్ధమైన తల్లిపాలు బిడ్డకు ఎంతోమేలు చేస్తాయనే విషయం తల్లులు గుర్తించాలని కోరారు. అనేక పరిశోధనల్లో తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లీ బిడ్డా ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని తేలినట్టు వివరించారు. ఈ సమావేశంలో వైద్యులు కె.విజయకృష్ణ, జి. మౌనిక, శ్రీరంగా, గీతావందన, విద్యారమ, భూ లక్ష్మి, మౌనిక, మహిళలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పీడీ జయదేవి

మద్దిలపాలెం: తల్లిపాలతో పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ జి. జయదేవి అన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై బుధవారం ఆర్ఆర్‌అండ్‌బీ జంక్షన్‌వద్దనున్న ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్ వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుట్టిన బిడ్డకు మొదటిగంటలో తల్లి ముర్రుపాలు ఎంతో ముఖ్యమన్నారు. ఆరునెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వా లన్నారు.

ఈకార్య క్రమంలో భాగంగా అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయించిన ఆమె పరిసర ప్రాం తాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐసీడీ ఎస్ అర్బన్ సీడీపీఓ జి. శ్రీలత పర్యవేక్షించారు. కార్యక్రమంలో యుపీహెచ్‌సీ వైద్యాధికారి ఎంజెలినా, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

పట్టుబట్టారు.. సాధించారు

పంచాయతీ గ్రామమైన చింతల అగ్రహారంలో జీవీఎంసీ నిధులతో అభివృద్ధి పనులు

అందుబాటులోకి వచ్చిన సిమెంటు రోడ్డు, తాటిపూటి రిజర్వాయర్ తాగునీటి జలాలు

సమష్టిగా ముందుకు సాగుతున్న గ్రామస్థులు, రాజకీయ పార్టీల నాయకులు



చింతల అగ్రహారం గ్రామంలో వేసిన సిమెంటు రోడ్డు. (ఇన్‌సెట్లో) గ్రామం వ్యూ

పెందుర్తి-రూరల్, ఆగస్టు 7: మండలంలోని చింతల అగ్రహారం ఓ పంచాయతీ గ్రామం. ఈ గ్రామానికి జీవీఎంసీ అధికారులు కోటి రూపాయలకు పైబడిన నిధులతో పక్కా సిమెంటు అప్రోచ్ రోడ్డును నిర్మించారు. అంతేకాకుండా గ్రామానికి ఆనుకుని పేరుకుపోయిన గెడ్డలో పూడికను తీయించారు. నగర ప్రాంతానికి సరఫరా అవుతున్న పరిశుద్ధమైన తాటిపూడి రిజర్వాయర్ తాగునీటి జలాలను చింతల అగ్రహారం ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. ఇదేంటీ.. జీవీఎంసీ నిధులతో పంచాయతీ గ్రామానికి ఈ ప్రగతి పనులేంటని ఆశ్చర్యపోతున్నారా?.. ఇదంతా చింతల అగ్రహారం గ్రామస్థుల ఐక్యతతోనే సాధ్యపడింది. వివరాల్లోకి వెళితే..

యూజీడీ పనులు అడ్డగింపుతో..

నగరంలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ నిర్మాణ (యూజీడీ) పనులు క్లైమాక్స్‌కు చేరుకున్నాయి. ఈ క్రమంలో నరవ వద్ద నిర్మిస్తున్న మురుగు నీటి శుద్ధి ప్లాంట్‌కు పైపులను కలుపుదామనుకునేసరికి జీవీఎంసీ అధికారులకు సమస్య తలెత్తింది. వేపగుంట, పినగాడి ప్రధాన రహదారి నుంచి చింతల అగ్రహారానికి వెళ్లే అనుసంధాన రహదారి మార్గం ద్వారానే యూజీడీ పైపు లైన్లను ఏర్పాటు చేయాల్సి ఉంది. సుమారు కిలోమీటరు పొడవు గల ఈ అనుంధాన రహదారి భూగర్భంలోనే గ్రామానికి వెళ్లే తాగునీటి పైపు లైన్లు ఉన్నాయి. దీంతో ఈ రోడ్డు మార్గంలో పైపు లైన్ల నిర్మాణ పనులు చేపట్టడానికి వచ్చిన సిబ్బంది, కాంట్రాక్టర్‌ను గ్రామస్థులు అడ్డుకున్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, గ్రామస్థులు సమష్టిగా ఉద్యమంలా కదలి వచ్చి పనులను అడ్డుకున్నారు. ఈ రోడ్డు మార్గంలో యంత్రాలతో తవ్వకాలు జరిపితే దిగువన ఉన్న తాగునీటి పైపు లైన్ల పరిస్థితి ఏంటంటూ ఆందోళనకు దిగారు. పైపు లైన్ల ఏర్పాటు పనులు పూర్తవ్వగానే పగిలిపోయిన పైపు లైన్లకు మరమ్మతులు చేపట్టి రోడ్డును నిర్మిస్తామని కాంట్రాక్టర్ చెప్పినప్పటికీ గ్రామస్థులు ఒప్పుకోలేదు. జీవీఎంసీ ఉన్నతాధికారులు వచ్చి తమకు హామీ ఇస్తే తప్పా పనులు జరగనివ్వబోమని భీష్మించారు. దీంతో అప్పటి గ్రేటర్ కమిషనర్ సాయికాంత్ వర్మ, నాటి పెందుర్తి ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు, పలువురు అధికారులు ఇక్కడకు వచ్చి గ్రామస్థులతో సుదీర్ఘ చర్చలు జరిపి ఆందోళనకారుల డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇందులో భాగంగా స్థానిక గెడ్డలో పేరుకుపోయిన పూడికను ఎక్స్‌కవేటర్‌తో తీయించారు. యుద్ధప్రాతిపదికన ఇక్కడి రైల్వే ట్రాక్ దిగువ భాగంలో తాగునీటి పైప లైనును వేసి గ్రామంలోకి నీటిని సరఫరా చేశారు. అనంతరం యూజీడీ పనులు పూర్తిచేశాక అనుసంధాన మార్గంలో పక్కా సిమెంటు రోడ్డును నిర్మించడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కొళాయిల ద్వారా జీవీఎంసీ సరఫరా చేస్తున్న తాగునీటిని పట్టుకుంటున్న గ్రామస్థులు

నెరవేరిన కల

చింతల అగ్రహారం గ్రామంలో మూడు రక్షిత తాగునీటి పథకాలు ఉన్నాయి. ఈ మూడింటి నుంచి ఫ్లోరైడ్ నీరే వస్తుండడం వల్ల తాగడానికి పనికిరాకపోవడంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. దీంతో తాగునీటిని ఆర్వో ప్లాంట్ల వద్ద కొనుగోలు చేసేవారు. అయితే తమ ఆందోళన ఫలించడంతో ఇప్పుడు తమకు పరిశుద్ధమైన తాడిపూడి జలాలు అందుతున్నాయని ఆనందంతో చెబుతు న్నారు. సమస్యల పరిష్కార విషయంలో ఆదినుంచి గ్రామస్థులు, అన్ని పార్టీల నాయకులు రాజకీయాలకు అతీతంగా ఐక్యత బాట పట్టడం వల్లే మంచి ఫలితాలను సాధిస్తున్నారు. స్థానికంగా జెడ్పీ ఉన్నత పాఠశాల, పదో తరగతి పరీక్ష కేంద్రం ఏర్పాటు, తరగతి గదుల నిర్మాణం, పశువుల ఆస్పత్రి అభివృద్ధి, ఆలయాల నిర్మాణం, సంకాంతి సంబరాలు, వినాయక చవితి ఉత్సవాలు, పరసలు, శ్రీరామ నవమి వేడుకలు, శ్రావణ, కార్తీక, దసరా ఉత్సవాలను విజయవంతంగా, సమష్టిగా నిర్వహిస్తూ గ్రామస్థులు ముందుకు సాగుతున్నారు.



స్టేషన్‌లోని నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్

సింహాచలం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించిన డీఆర్ఎం

గోపాలపట్నం, ఆగస్టు 7: సింహాచలం రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ బుధవారం పరిశీలించారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా ఈ రైల్వే స్టేషన్‌ను రూ.19.5 కోట్లతో అభివృద్ధి పరిచేందుకు గత ఏడాది ప్రతిపాదన చేశారు. ఇందులో భాగంగా గత డిసెంబరులో స్టేషన్ రైల్వే శాఖ మంత్రి శంకుస్థాపన చేశారు. కాగా ఇటీవల స్టేషన్ ప్రాంగణంలో నిర్మాణ పనులు జరుగుతున్న నేపథ్యంలో డీఆర్ఎం పరిశీలించారు. పనుల్లో పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

పంచకర్లకు పవన్‌కల్యాణ్ అభినందనలు



పంచకర్ల రమేశ్‌బాబును అభినందిస్తున్న పవన్‌కల్యాణ్

పెందుర్తి, ఆగస్టు 7: జనసేన పార్టీ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలోనే ద్వితీయ రెండు స్థానం, విశాఖ ఉమ్మడి జిల్లాలో ప్రథమ స్థానంలో పెందుర్తి నియోజకవర్గాన్ని నిలిపినందుకు ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబును ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రత్యేకంగా అభినందించారు. పెందుర్తి నియోజవర్గంలో 26,656 మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. ఈ ప్రక్రియలో క్రియాశీలకంగా వ్యవహరించి రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిపినందుకు పంచకర్లను పవన్ ప్రశంసించారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 7: స్టీల్‌ప్లాంట్ సీడీపై విభాగంలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల ప్రధాన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం విభాగాధిపతికి కార్మిక నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, ఎనిమిది గంటలు పనిచేసే విధంగా చేయాలని, దుమ్ము, ధూళి సమస్యను పరిష్కరించాలని, వేతనాలు పెంచాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పిట్టా రెడ్డి, మన్మధరావు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

పెంపుడు శునకానికి అంత్యక్రియలు



అంత్యక్రియల్లో పాల్గొన్న కుటుంబ సభ్యులు

మల్కాపురం, ఆగస్టు 7: పదమూడేళ్ల పాటు ఎంతో అప్యాయంగా పెంచుకున్న కుక్క (రుబీ) మృతి చెందడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీ రయ్యారు. మల్కాపురం ఎస్సీ కాలనీలో ముప్పిడి శంకర్మ కుటుంబం పెంపుడు కుక్కను పెంచుకోగా, బుధవారం ఉదయం అది మృతి చెందింది. పెంపుడు కుక్కపై ఉన్న మమకారంతో హిందూ సంప్రదాయం ప్రకారం స్థానిక శ్మశానవాటికలో అంత్యక్రియలు చేశారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం, ఆగస్టు 7: బీహెచ్‌పీవీ సబ్ స్టేషన్ పరిధిలోని షీలానగర్ 11 కేవీ ఫీడర్‌కు నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ అధికారులు తెలిపారు. ఈ కారణంగా ఆ రోజు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు అక్కిరెడ్డిపాలెం, డెయిరీ క్వార్టర్స్, పంచవటి కాలనీ, వికాస్ కళాశాల, బీపీసీఎల్ బంక్, జీవీఎంసీ వాటర్ వర్క్స్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సమస్యలను పరిష్కరించాలని వైద్యుల వినతి

అగనంపూడి, ఆగస్టు 7: రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన ప్రభుత్వ ఆస్పత్రుల్లో నేచురోపతి వైద్యం అందిస్తున్న డాక్టర్ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును బుధవారం పలువురు కలిసి వినతిపత్రం అందజేశారు. తాము గత 15 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో నేచురోపతి వైద్యం అందిస్తున్నామన్నారు. ఏటా కాంట్రాక్టును రెన్యూవల్ చేసి తమ సేవలను వినియోగించుకుంటున్నారన్నారు. వేతనాలు కూడా సకాలంలో అందించడం లేదని, దీనివల్ల ఇబ్బందులు పడుతున్నామని పల్లాకు వివరించారు. గత పదేళ్లుగా తమను శాశ్వత ఉద్యోగుల గుర్తించాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఫలితం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల తమ సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కాగా తమ సమస్యల పల్లా సానుకూలంగా స్పందించనట్టు వైద్యులు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో డాక్టర్ హరికృష్ణ, తదితరులు ఉన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టీడీపీ విజయం పట్ల హర్షం

గాజువాక, ఆగస్టు 7: జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పది స్థానాల్లో విజయం సాధించడం హర్షనీయమని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ టీడీపీ అభ్యర్థి విజయం తథ్యమన్నారు. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో విజయానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు చేసిన కృషి విశేషమన్నారు.



గోదాదేవికి హారతిస్తున్న అర్చకుడు

గోదాదేవికి తిరు నక్షత్ర పూజలు

పెందుర్తి, ఆగస్టు 7: వెంకటాద్రి శిఖరంపై కొలువు దీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం గోదాదేవి జన్మదినం సందర్భంగా అమ్మవారికి తిరునక్షత్ర పూజలను నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అమ్మవారి మూలవిరాట్టుకు పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. దివ్య ప్రబంధ పారాయణం చేపట్టి నక్షత్ర హారతిలిచ్చారు. చాతుర్మాస్య దీక్షలో భాగంగా రామయణ హవనం చేశారు. పెద్దసంఖ్యలో భక్తులు గోదాదేవిని దర్శించుకున్నారు.

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల వేంకటేశ్వర వినాయకస్వామి దేవస్థానంలో గోదాదేవి అమ్మవారికి తిరు నక్షత్ర పూజలు చేశారు. ప్రధాన అర్చకులు లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితులు గోదాదేవి అమ్మవారికి పంచామృతాలతో అభిషేకించాక పువ్వులు, నగలతో అలంకరించారు. గోదాదేవికి అష్టోత్తర శతనామార్చన, కుంకుమార్చనలు జరిపారు.

పెదగంట్యాడ: హౌసింగు బోర్డు కాలనీలోని అభయాంజనేయ హరిహర క్షేత్రం ఆవరణలోని గోదాదేవి అమ్మవారిని నూతన వస్త్రాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు రాఘవాచార్యులు, ప్రతినిధులు రమేశ్, మృత్యుంజరావు, తదితరులు పాల్గొన్నారు.

వేపగుంట: నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపైనున్న కల్యాణ వేంకటేశ్వరాలయంలో గోదాదేవికి తిరు నక్షత్ర పూజలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అష్టోత్తర నామార్చాన పూజలు, అభిషేకాలను అర్చకుడు శ్రీనివాసస్వామి జరిపారు.

సినిమా గైడ్

- **బడ్డీ :** జగదాంబ, శ్రీకన్య, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), సౌజన్య (గోపాలపట్నం), మోహిని (గాజువాక), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), నటరాజ్-2 (పెందుర్తి), గణేష్ (తగరపువలస)
- **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), నటరాజ్-1 (పెందుర్తి), లక్ష్మీకాంత్ (గాజువాక), సీతారామయ్య (పరవాడ), అరుణ (పెదగంట్యాడ), తాతా (తగరపువలస)
- **ఉషా పరిణయం :** రమాదేవి, మోహిని (గాజువాక)
- **రాయన్ :** జగదాంబ, గోకుల్, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), రాములమ్మ (తగరపువలస)
- **కల్కి :** శ్రీరామ, కన్య (గాజువాక), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 27, వంకాయలు (తెలుపు) 52, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 18, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయ 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజీ 30, క్యారెట్ 32, దొండకాయలు 26, బంగాళదుంపలు 36, అరటికాయ (పెద్దది)7, అల్లం (పాతది) 150, మునక్కాడలు (కిలో) 52, బరబాటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోసకాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 72, పొటల్స్ 30, కీరదోస 30, క్యాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడుచిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్ద కట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్రాయ్లర్

రైతు ధర	--	75
ఫారం ధర	--	95
విత్ స్కిన్	--	160
స్కిన్‌లెస్	--	170

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

సుజాతనగర్‌లో ఆక్రమణలకు అడ్డుకట్ట

» ప్రభుత్వ స్థలంలో పాకల తొలగింపు

» సర్కారు స్థలాలను ఆక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం: తహసీల్దార్



ఆక్రమిత స్థలంలో తహసీల్దార్ వేణుగోపాల్, తదితరులు

పెందుర్తి, ఆగస్టు 7: సుజాతనగర్‌లో ఆక్రమణలకు రెవెన్యూ అధికారులు అడ్డుకట్ట వేశారు. ఇక్కడి సర్వే నంబర్‌లో 185లో ప్రభుత్వ స్థలాన్ని కొంతమంది ఆక్రమించి ఆవాసాలు ఏర్పాటు చేశారు. పేదలను మభ్యపెట్టి దళారులు ఈ స్థలాలను విక్రయించి సొమ్ము చేసుకున్నట్టు ఆరోపణలు రావటంతో తహసీల్దార్ కోరాడ వేణుగోపాల్ విచారణ చేపట్టారు. ఇటీవల తహసీల్దార్ ఈ స్థలాలను సందర్శించి ఆక్రమణలను పరిశీలించారు. మళ్లీ బుధవారం తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది పోలీసుల బలగాల సాయంతో ఈ స్థలానికి చేరుకున్నారు. యుద్ధ ప్రాతిపదికన అక్రమంగా వేసిన పాకలను తొలగించారు. కాగా ఆక్రమణదారులు తీవ్రంగా ప్రతిఘటించారు. పేదల ఆవాసాలను కూల్చివేయడం తగదని నిరనసన తెలిపారు. దీంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో తహసీల్దార్ జోక్యం చేసుకుని అర్హులైన పేదలు దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ పరంగా గృహ నిర్మాణాలకు శాఖాపరమైన చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలిగించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అటువంటి వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. అలాగే సుజాతనగర్‌లో కాలనీని ఆనుకుని ఉన్న సర్వే నంబర్-163లో 24.86 ఎకరాల్లోని చెరువు ఆక్రమణలపై విచారణ పూర్తయిందన్నారు. ఆక్రమిత స్థలాల్లో నకిలీ పట్టాలతో విక్రయాలు జరిపినట్టు గుర్తించామన్నారు. చెరువులోని ఆక్రమణలను త్వరలో తొలగిస్తామని పేర్కొన్నారు.

చేనేత రంగానికి పూర్వ వైభవం తెస్తాం

తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పల్లా శ్రీనివాసరావు

గాజువాక, ఆగస్టు 7: చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. గాజువాకలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేనేత రంగం నాశనమైందన్నారు. చేనేత కార్మికులకు రుణాలు అందించేందుకు కృషి చేస్తామన్నారు. చేనేత నాయకుడు పప్పు రాజారావు మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత బజార్లను ఏర్పాటు చేయాలని, చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయాలని కోరారు. చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు దొడ్డి సత్యారావు, నామాల శ్రీకాంత్, పిల్లి చంద్రరావు, శేఖర్, దేముడు, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల త్యాగాలకు విలువ ఇవ్వాలి

ఇంటక్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు

కూర్మన్నపాలెం, ఆగస్టు 7: ఉక్కు కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాసితుల త్యాగాలకు విలువ ఇచ్చి స్టీల్‌ప్లాంటును ప్రభుత్వ రంగంలోనే నడిపేలా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని ఇంటక్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ఉపాధ్యక్షుడు జెర్రిపోతుల ముత్యాలు అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 1,273వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఉక్కు కర్మాగారాన్ని కాపాడతానని హామీ ఇచ్చారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఉక్కు ఉద్యమానికి మద్దతుగా నిలవాలని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరిస్తే కర్మాగారం కోసం భూములిచ్చిన నిర్వాసితుల జీవితాలను అంధకారం చేయడమే అవుతుందన్నారు. ఉక్కు కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ గత కొద్ది నెలలుగా కాంట్రాక్టు కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించడం లేదని, ఉత్పత్తికి సరిపడా ముడసరకు లేక కార్మికులు ఆందోళన చెందుతున్నారన్నారు. ప్లాంటులో సాధారణ ఉత్పత్తి సాధించేం దుకు యాజమాన్యం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులను సత్కరించిన లావు రత్తయ్య

లక్ష్యాన్ని నిర్దేశంచుకుని రాణిస్తే ఉజ్వల భవిత

విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య

అగనంపూడి, ఆగస్టు 7: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశంచుకుని రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు లభిస్తుందని విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్‌లో మొదటి సంవత్సరంలో ప్రవేశాలు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు బుధవారం ఏర్పాటు చేసిన స్వాగత కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులంతా మొదటి ఏడాది నుంచే ధృడ సంకల్పం, ఏకాగ్రతతో చదివితే విజయం సాధించడం సులభమవుతుందన్నారు. ప్రస్తుతం సాంకేతిక రంగాల్లో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులకు అనుగుణంగా రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించి తల్లిదండ్రులు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని లావు రత్తయ్య పేర్కొన్నారు. ఈ ఏడాది 1,009 మంది విద్యార్థులు మంచి ప్యాకేజీతో కూడిన ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. అనంతరం క్యాంపస్ ఉద్యోగాలకు ఎంపిక విద్యార్థులను, తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, జెసుధాకర్, అరుంధతి, అధ్యాపక సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

95వ వార్డులో జెడ్సీ పర్యటన

పెందుర్తి-రూరల్, ఆగస్టు 7: గ్రేటర్ 95వ వార్డు పరిధి లక్ష్మీపురం, గవరపాలెం ప్రాంతాల్లో జోనల్ కమిషనర్ హేమలత బుధవారం ఉదయం సిబ్బందితో కలిసి పర్యటించారు. వార్డులోని పలు సమస్యలను పరిశీలించడంతో పాటు స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మురుగు కాలువల్లో పూడికలతో దుర్వాసన వెలువడుతుండడంతో ఇబ్బందులు పడుతున్నట్టు పలువురు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె కాలువలను పరిశీలించి పూడికలను తొలగించాలని పారిశుధ్య సిబ్బందిని ఆదేశించారు. గవరపాలేనికి వెళ్లే అనుసంధాన మార్గంలో చేపట్టిన తాగునీటి పైపులైన్ మరమ్మతుల పనులను పరిశీలించారు. సచివాలయ సిబ్బంది పాత్రుడు, తదితరులు పాల్గొన్నారు.

'కార్మిక సంక్షేమానికి ఏఐటీయూసీ విశేష కృషి'

ఉక్కుటౌన్‌షిప్, ఆగస్టు 7: కార్మిక సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా తాము ముందుకు సాగుతున్నామని గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు కేఎస్ఎన్ రావు అన్నారు. ప్లాంటులో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సొంత గనులు లేకపోయినా దేశంలో అన్ని సంస్థల కంటే ప్రగతిపథంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ ముందుందన్నారు. ఇటువంటి ప్లాంటును ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావడం దుర్మార్గమన్నారు. సమావేశంలో నాయకులు డి.నరసింగరావు, ఎస్.తాతారావు, వై.శ్రీనివాసరావు, నాయుడు, దేముడు, సోంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ములగాడ తహసీల్దార్‌కు అభినందనలు

మల్కాపురం, ఆగస్టు 7: ములగాడ మండల తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన తారకేశ్వరిని బుధవారం కూటమి నాయకులు కలిసి అభినందనలు తెలిపారు. మండలంలో రెవెన్యూ పరంగా ఉన్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు సకాలంలో అందించేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, తెలుగు యువత నాయుడు సీహెచ్ రామ్మోహన్‌నాయుడు, బీజేపీ నాయకుడు పోలిమేర శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


అగనంపూడి, ఆగస్టు 7: జీవీఎంసీ 85వ వార్డు పరిధి పెదమడక పద్మమార్కండేయ సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు భావనారుషి పద్మావతి చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు వక్తలు మాట్లాడుతూ చేనేత వస్త్రాలను ప్రతిఒక్కరూ ఆదరించి నేతన్నలకు అండగా నిలవాలన్నారు. అనంతరం పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కొలిపాక అప్పారావు, బి.సత్యనారాయణ, ప్రభావతి, బి.హనుమంతరావు, పైడికొండ, రాజు, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అగనంపూడి, ఆగస్టు 7: సీజనల్ వ్యాధుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ భారతి సూచించారు. స్థానిక హోమియో విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల జర్వాలతో పాటు వ్యాధులు విజృంభిస్తున్నాయన్నారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, హోమియోపతి మందులను పంపిణీ చేశారు. వైద్యులు కళావతి, ఉష, గోపీకృష్ణ, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.







ప్రజా ప్రయోజనాలకనుగుణంగా స్మార్ట్ సిటీ పనులు: కలెక్టర్

మహారాణిపేట, ఆగస్టు 7: ప్రజా ప్రయోజనాలకనుగుణంగా గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ పనులు చేపట్టాలని కలెక్టర్ ఎంఎన్ హరేంధిర ప్రసాద్ కోరారు. స్మార్ట్ సిటీ కార్పొరేషన్ కార్యకలాపాలు, అభివృద్ధి ప్రాజెక్టులపై కలెక్టర్ బుధవారం సమీక్షించారు. కలెక్టరేట్‌లోని స్మార్ట్ సిటీ కార్పొరేషన్ బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ ఇప్పటి వరకు చేపట్టిన పనులు, భవిష్యత్తు ప్రాజెక్టులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగర సుందరీకరణ దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తుప్రాజెక్టులు చేపట్టాలని సూచించారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్లు కొన్ని అంశాలు యథావిధిగా ఆమోదించగా, మరికొన్నింటిపై మార్పులు సూచించారు. నగరం లో ముఖ్య కూడళ్లలో అభివృద్ధి, సుందరీకరణ, తాగునీటి సదుపాయం మెరుగుదల, మౌ లిక వసతుల కల్పన తదితర అంశాలపై దృష్టిసారించి పనులు వేగవంతం చేయాలని ఈ సందర్భంగా పలువురు డైరెక్టర్లు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విఠల్ కుమార్ , సెక్రటరీ కుసుమాంబ, పోలీసు కమిషనర్ శంఖబ్రాత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ పి. సంపత్ కుమార్, ఏపీ ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

టర్నర్ చౌల్ట్రీ వద్ద ఆక్రమిత స్థలం స్వాధీనం

జగదాంబ కూడలి, ఆగస్టు 7: వన్‌టౌన్‌లోని టర్నర్ చౌల్ట్రీ దరి మెయిన్‌రోడ్డు వద్ద జీవీఎంసీ ఆక్రమిత స్థలాన్ని టౌన్ ప్లానింగ్ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. గత 30 ఏళ్లకు పైగా ఇక్కడి జీవీఎంసీ మార్గాన్ని ఓ వస్త్రవ్యాపారి ఆక్రమించి వ్యాపారాన్ని సాగిస్తున్నారు. టర్నర్‌చౌల్ట్రీ ప్రహరీ మెయిన్ రోడ్డు ఫుట్‌పాత్ నుంచి దాదాపు అరడగులు పొడవు, 20 అడుగుల వెడల్పున గల రహదారి మార్గం ఆక్రమించారు. ఈ నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'లో ఈ నెల 5వ తేదీన 'జీవీఎంసీ స్థలం ఆక్రమణ' శీర్షికన కథనం ప్రచురించింది. ఈ స్థితిలో జోనల్ కమిషనర్ ప్రసాద్ ఆదేశాలతో అసిస్టెంట్ సిటీప్లానర్, సిబ్బంది రెండురోజులుగా పూర్తిస్థాయిలో ఆక్రమణలను తొలగించారు. ఇక్కడ రాకపోకలకు వీలుగా రహదారి ఏర్పాటు చేయాలని స్థానికులు కో రుతున్నారు. ఇంతవరకు జీవీఎంసీ ఈ ఆక్రమిత స్థలానికి నామమాత్రంగా పన్ను వసూలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జగదాంబ నుంచి పూర్ణామార్కెట్ వరకు ప్రత్యేక దృష్టి సారిస్తే మరిన్ని ఆ క్రమణలు బయటపడతాయని పలువురు కోరుతున్నారు.


ఆక్రమణలు తొలగింపుతో విశాలంగా మారిన రస్తా

టమాటా కోసం బారులు

సీతమ్మధార, ఆగస్టు 7: సీతమ్మధారలోని రైతుబజార్‌లో బుధవారం టమాటా కోసం జనం బారులు తీరారు. మంగళవారం సెలవు కావడంతో హోల్‌సేల్ మార్కెట్ నుంచి వ్యాపారులు టమాటా తేవడం ఆలస్యమైంది. దీంతో బజార్‌కి వచ్చే కొనుగోలుదారులు నిరీక్షించాల్సి వచ్చింది. నగరంలో పెద్ద బజార్‌లుగా పేరొందిన ఎంవీపీ కాలనీ, అక్కయ్యపాలెం రైతుబజార్ బుధవారం సెలవు కావడంతో అధిక సంఖ్యలో జనం సీతమ్మధారకు వచ్చారు. దీంతో బజార్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేసి టమాటా విక్రయించేలా బజార్ ఎస్టేట్ అధికారి కొండబాబు, సహాయకులు సతీష్ చర్యలు చేపట్టారు. కిలో రూ.27 చొప్పున విక్రయించారు.


సీతమ్మధార రైతుబజారులో కొనుగోలుదారులు

మహిళా కళాశాలలో చేనేత దినోత్సవం


కార్యక్రమంలో చేనేత వస్త్ర ధారణలో విద్యార్థినులు

జ్ఞానాపురం, ఆగస్టు 7: సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హోం సైన్స్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం చేనేత దినోత్సవం నిర్వహించినట్టు విభాగాధిపతి సోని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులు చేనేత వస్త్రాలపై అవగాహన కలిగేలా రూపొందించిన డాక్యుమెంటరీ ప్రదర్శించారు. పోచంపల్లి, గద్వాల్, మంగళగిరి, గుంటూరు, వెంకటగిరి, కంచి, నారాయణపేట చేనేత వస్త్రాలను ధరించి వాటి ప్రత్యేకతను వివరించారు. అనంతరం నిర్వహించిన ఫ్యాషన్ వాక్‌లో విద్యార్థినులు, అధ్యాపకులు పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా డా క్టర్ లక్ష్మీప్రభ పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతగా డాక్టర్ పీకే జయలక్ష్మి వ్యవహరించారు. చేనేత మన సంస్కృతి అని..చేనేత కార్మికులను ఆదరించడం మన కర్తవ్యమని అతిథులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నివ్య శ్రీజ, గాయత్రి, దీపాలి పాల్గొన్నారు.

కళ్ల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

డాబాగార్డెన్స్, ఆగస్టు 7: బాల్యం నుంచే కళ్లపై శ్రద్ధ ఎంతో అవసరమని రమాదేవి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హనుమంతు ప్రభాకర్ అన్నారు. జీవీఎంసీ పరిధి 31వ వార్డు జీవీఎంసీ ఆర్‌బీయూపీ పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ప్రాంతీయ కంటి ఆస్పత్రి వైద్యులు ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వైద్య పరీక్షలను నిర్వహించారు. పౌష్టిహాకారం తీసుకోవడంతోపాటు చదువుకునే సమయంలో కళ్లను నీటితో శుభ్రం చేసుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లకు విద్యార్థులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకరాజు, రాంబాబు, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.


చిన్నారులకు కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

చిట్టీల పేరిట టోకరా

▸▸ పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు

పెందుర్తి, ఆగస్టు 7: పెందుర్తిలో మరో మహిళ చిట్టీల పేరిట మోసం చేసిన ఘటన వెలుగుచూసింది. రూ.కోట్లలో లావాదేవీలు నిర్వహించి, ముఖం చాటేయడంతో బాధితులు చిట్టీ నిర్వాహకురాలి ఇంటి సమీపంలో బుధవారం నిరసన తెలిపారు. బాధితులు, సీఐ ఎల్. రామకృష్ణ అందజేసిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తిలోని గాంధీనగర్ సమీపంలో ఉంటున్న కంచి మాధవి పదేళ్లుగా చిట్టీలు నిర్వహిస్తున్నారు. ఆమె తండ్రి, భర్త రియల్ ఎస్టేట్, కనస్ట్రక్షన్ వ్యాపారం నిర్వహిస్తూ పెందుర్తిలో సుపరిచితులు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉన్న పలుకుబడిని ఆసరాగా చేసుకుని మాధవి చీటీలు వేశారు. ఈ క్రమంలో పలువురు చిట్టీలు కట్టారు. కొంతకాలం ఈ వ్యాపారం సజావుగా కొనసాగడంతోనమ్మకం కుదిరి మరింత మంది చేరారు. సంక్రాంతి, దసరా చీటీలు, శ్రావణమాసం గోల్డెన్ డ్రా చీటీల పేరిట మాధవి సొమ్ము కట్టించుకున్నారు. దీనికితోడు కమీషన్ ఆశ చూపి ఏజెంట్లతోనూ ఆమె చిట్టీల పేరిట కోట్లలో వ్యాపార లావాదేవీలు సాగించినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. ఏడాదిగా ఆమె చిట్టీల సొమ్ములు చెల్లించచడంలేదు. దీంతో ఈ విషయంపై ఆమె తండ్రి సిల్లా ప్రసాదరావు వద్ద పంచాయితీ పెట్టగా త్వరలో బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చినా.. అది నెరవేరలేదని పలువురు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం పలువురు బాధితులు కంచి మాధివి ఇంటి సమీపంలో న్యాయం చేయాలని ఆందోళన చేపట్టారు.


చిటీల నిర్వాహకురాలి ఇంటి సమీపంలో నిరసన తెలుపుతున్న బాధితులు

రూ. 3. 50 కోట్ల మోసం

చిట్టీల పేరిట రూ 3.5 కోట్లు మోసం జరిగిందని పెందుర్తి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు అందినట్టు సీఐ రామకష్ణ తెలిపారు. అయితే, బాధితులు మాత్రం రూ. 15 కోట్లు వరకు ఉంటుందని అంటున్నారు. తమకు ఆధారాలతో రూ. 3.5 కోట్లు మోసం జరిగి నట్టు గుర్తించామని, దీనిపై నిందితురాలు మాధవితో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.



నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సీతమ్మధార, ఆగస్టు 7: ఆశీలమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో విద్యుత్ ఫీడర్స్ మరమ్మతు పనుల చేపడుతున్నందున గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్ -1 ఎలక్ట్రికల్ ఈఈ బి.సింహాచలం తెలిపారు. సీతమ్మధార ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఎదురు ప్రాంతం, ఫోర్త్ టౌన్ పోలీసు స్టేషన్ రోడ్డు, మోర్ సూపర్‌మార్కెట్ , బాలయ్యశాస్త్రి లే అవుట్, సీతమ్మధార వినియోగదారులు గమనించాలని కోరారు.

అక్కయ్యపాలెం పరిధిలో రేపు..

అక్కయ్యపాలెం: నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు తెలిపారు. శంకువానిపాలెం, సరోజిని హాస్పిటల్, జగ్గారావు బ్రిడ్జి ఏరియా, ఎనభై అడు గుల రోడ్డు, చిన్నూరు, జీవీఎంసీ ఉన్నత పాఠశాల ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు.

సచివాలయంలో జడ్సీ తనిఖీ

జ్ఞానాపురం, ఆగస్టు 7: గ్రేటర్ 53వ వార్డు పరిధి 295 నంబరు సచివాలయాన్ని జోన్-5 జోనల్ కమిషనర్ ఆర్జీవీ కృష్ణ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పరిశీలించారు. ప్రజలకందిస్తున్న సేవల్లో నిర్లక్ష్యం వహించవద్దన్నారు. సూపరింటెండెంట్ టీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు.


హాజరు పట్టిక పరిశీలిస్తున్న జడ్సీ కృష్ణ

తాటిచెట్లపాలెంలో చెత్త తొలగింపు

అక్కయ్యపాలెం, ఆగస్టు 7: తాటిచెట్లపాలెం ప్రాంతంలో పేరుకుపోయిన చెత్తను జీవీఎంసీ పారిశుధ్య కార్మికులు ఎక్స్‌వేటర్‌తో బుధవారం తొలగించారు. ఇటీవల జీవీఎంసీ కమిషనర్ కొండవాలు ప్రాంతాలను పర్యటించారు. అక్కడ చెత్త కుప్పలు దర్శనమివ్వడంతో వాటిని తొలగించాలని అధికారులు ఆదేశించారు. దీంతో ఆ చెత్త కుప్పలకు విముక్తి కలిగింది.

మారని కోర్బా తీరు!

... 5వ పేజీ తరువాయి

తేలింది? ఎవరి తప్పు వల్ల ప్రమాదం జరిగింది? ఎటువంటి చర్యలు తీసుకున్నారనే వివరాలు వాల్తేరు డివిజన్ అధికారులు బయట పెట్టడంలేదు. ఇటీవల కంటకాపల్లిలో ఆగిఉన్న ప్రయాణికుల రైలును వెనుక నుంచి మరో రైలు వచ్చి ఢీకొట్టింది. ఇందులో అనేక సాంకేతిక లోపాలపై చర్చ జరిగింది. అయితే ప్రమాదానికి అసలు కారణమేమిటనేది ఇప్పటివరకు ప్రకటించ లేదు. కానీ కొందరు స్టేషన్ మాస్టర్లను బదిలీ చేసి చేతులు దులుపుకొన్నారు. అలాంటి ప్రమాదం జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకున్నారో కూడా చెప్పలేదు.

కోర్బా అగ్నిప్రమాదం కూడా అలాగే మిగిలిపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లో పొగలు, మంటలు వస్తే స్మోక్ సెన్సార్లు ఎందుకు పనిచేయలేదనే అంశంపై అధికారులు దృష్టి పెట్టడం లేదు. మాక్ డ్రిల్ తరహాలోనైనా ఏదైనా ఎల్‌హెచ్‌బీ కోచ్‌లో పొగపెట్టి అలారం మోగించి, సహాయక చర్యలు చేపడితే ప్రయాణికులకు కొంత అవగాహన, నమ్మకం ఏర్పడతాయి. అంతేకాదు ప్రమాదం జరిగిన తరువాతైనా మంటలు వ్యాపింపజేసే సరకుల రవాణా జరుగుతుందేమో తెలుసుకోవడానికి తనిఖీలు చేయాల్సి ఉంది. మూడు రోజులు దాటినా అటువంటి తనిఖీలు లేవు.

శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు దోహదం


మెడికవర్ ఆసుపత్రిలో అవగాహన సమావేశంలో వైద్యులు, సిబ్బంది

మహారాణిపేట, ఆగస్టు 7: నవజాత శిశువులు ఆరోగ్య రక్షణకు తల్లిపాలు ఎంతో దోహదపడతాయని ప్రముఖ నవజాత శిశువుల వైద్య నిపుణుడు శ్యామ సునీల్ కిశోర్ తెలిపారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా బుధవారం మహారాణిపేటలో మెడికవర్ ఉమెన్ అండ్ చైల్డ్ ఆసుపత్రిలో తల్లిపాల విశిష్టతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలలో ఎన్నో పోషకాలు ఉంటాయని, తల్లిబిడ్డకు చక్కని ప్రేమ బంధాన్ని పెంపొందిస్తామని పేర్కొన్నారు. మన దేశంలో బ్రెస్ట్ ఫీడింగ్ రేట్ చాలా తక్కువగా ఉందన్నారు. సహజసిద్ధమైన తల్లిపాలు బిడ్డకు ఎంతోమేలు చేస్తాయనే విషయం తల్లులు గుర్తించాలని కోరారు. అనేక పరిశోధనల్లో తల్లిపాలు ఇ వ్వడం ద్వారా తల్లీ బిడ్డా ఇద్దరూ ఆరోగ్యంగా ఉంటారని తేలినట్టు వివరించారు. ఈ సమావేశంలో వైద్యులు కె.విజయకృష్ణ, జి. మౌనిక, శ్రీరంగా, గీతావందన, విద్యారమ, భూ లక్ష్మి, మౌనిక, మహిళలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న పీడీ జయదేవి

మద్రిపాలెం: తల్లిపాలతో పిల్లల్లో వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుందని స్త్రీ శిశు సంక్షేమశాఖ పీడీ జి. జయదేవి అన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతపై బుధవారం ఆర్‌ఆర్‌అండ్‌బీ జంక్షన్‌వద్దనున్న ఐసీడీఎస్ కార్యాలయంలో అంగ న్ వాడీలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుట్టిన బిడ్డకు మొదటిగంటలో తల్లి ముర్రుపాలు ఎంతో ముఖ్యమన్నారు. ఆరునెలల వరకు బిడ్డకు తప్పనిసరిగా తల్లిపాలు ఇవ్వా లన్నారు.

ఈకార్య క్రమంలో భాగంగా అంగన్‌వాడీలతో ప్రతిజ్ఞ చేయించిన ఆమె పరిసర ప్రాం తాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఐసీడీ ఎస్ అర్బన్ సీడీపీఓ జి. శ్రీలత పర్యవేక్షించారు. కార్యక్రమంలో యుపీహెచ్‌సీ వైద్యాధికారి ఎంజెలినా, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీలో వైసీపీకి భారీ షాక్

... 5వ పేజీ తరువాయి

చేరుకుని ఓటు హక్కు వినియోగించుకున్నారు. తర్వాత వైసీపీ క్యాంప్‌నకు గైర్హాజరైన నలుగురు కార్పొరేటర్లు కూటమి కార్పొరేటర్లతో కలిసి బస్సులో జీవీఎంసీకి చేరుకోవడంతో వైసీపీ నేతలు అవాక్కయ్యారు.

అంచనాకు మించి ఓట్లు

మధ్యాహ్నం రెండు గంటలకు పోలింగ్ ముగియడంతో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభించారు. అయితే అంచనాకు మించి కూటమి అభ్యర్థులకు ఓట్లు రావడంతో కూటమినేతలతోపాటువైసీపీనేతలను సైతం ఆశ్చర్యపోయారు. కూటమికి 54 మంది కార్పొరేటర్లు బలం ఉంటే వారిలో ఒకరికి 66 ఓట్లు, ఇద్దరికి 65 ఓట్లు, మరో ఇద్దరికి 64 ఓట్లు, ఇంకో ఇద్దరికి 60 చొప్పున ఓట్లు రావడం విశేషం. మరోవైపు వైసీపీకి 43 మంది కార్పొరేటర్ల బలం ఉన్నప్పటికీ ఆపార్టీ నుంచి పోటీచేసిన అభ్యర్థుల్లో బిపిన్‌జైన్‌కు 21, కరజాడ వెంకట నాగశశికళకు 25, పల్లా అప్పలకొండకు 32, ముర్రువాణికి 36, తోటపద్మావతికి 36, మహ్మద్ ఇమ్రాన్‌కు 36 ఓట్లు వచ్చాయి. ఆపార్టీనుంచి పోటీచేసిన సాడి పద్మారెడ్డికి మాత్రమే గరిష్ఠంగా 42 ఓట్లు పడ్డాయి. దీనినిబట్టి వైసీపీ కార్పొరేటర్లు కూటమి అభ్యర్థులకు ఓటేసినట్టు తేటతెల్లమైంది.

వైసీపీ నేతల ఆందోళన

కూటమి అభ్యర్థులకు పోలైన ఓట్లలో 14 బ్యాలెట్ పేపర్లపై పెన్ను, పెన్సిళ్లతో ప్రత్యేకంగా కోడ్ వేసి ఉన్నాయంటూ వైసీపీ నేతలు అభ్యంతరం వ్యక్తంచేశారు. బ్యాలెట్‌పత్రాలపై పెన్ను, పెన్సిళ్లతో ఎలాంటి గీతలు ఉండకూడదని, ఒకవేళ అలా ఉంటే వాటిని చెల్లని ఓట్లుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. దీనికి అధికారులు ససేమిరా అనడంతో ఓట్ల లెక్కింపు కేంద్రం బయట ఆందోళనకు దిగారు. అప్పటికే జీవీఎంసీ కార్యాలయం ఆవరణలో ఉన్న డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, మొల్లి అప్పారావు, పల్లా దుర్గారావు అధికారులు నిబంధనలను పక్కనపెట్టి అధికారపార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపణలు గుప్పించారు. వారంతా కమిషనర్ పోర్టికో వద్ద బైఠాయించి పోలీసులకు, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. దీంతో పోలీసులు జోక్యంచేసుకుని ఆందోళన విరమింపజేసేందుకు యత్నించినా, తమకు కమిషనర్ వివరణ ఇవ్వాలని పట్టుబట్టడంతో ఏసీపీ సీహెచ్ వివేకానంద కమిషనర్ సంపత్‌కుమార్ వద్దకు వారిని తీసుకెళ్లారు. నిబంధనల్లో ఎక్కడా పెన్ను, పెన్సిల్, రహస్యకోడ్ ప్రస్తావనగానీ లేనందున, వాటిని చెల్లనిఓట్లుగా ప్రకటించడం సాధ్యం కాదని ఆయన వివరించారు. అయినప్పటికీ సంతృప్తి చెందక ఆందోళన కొనసాగించడంతో పోలీసులు వారిని బలవంతంగా బయటకు తరలించారు.

ఓషన్ డెక్ ఏర్పాటయ్యేనా?

... 5వ పేజీ తరువాయి

ఇతర సంస్థల సూచనలు, సలహాలు తీసుకున్నాకే అనుమతి ఇస్తారు. ఇదంతా పూర్తికావడానికి ఏడాదికి పైగానే సమయం పడుతుంది. ఈ విషయం వీఎంఆర్‌డీఏ ఇంజనీరింగ్ అధికారులకు కూడా తెలుసు. అయినా సరే తొమ్మిది నెలల్లో పూర్తిచేస్తామని ప్రకటించారు. అనుమతి కోసం ఏపీసీజెడ్‌ఎంఏకి లేఖ రాస్తే, వారు రెండుసార్లు వివరాలు తీసుకుని, చెన్నైలోని నేషనల్ సెంటర్ ఫర్ కోస్టల్ రీసెర్చి సంస్థ పరిశీలనకు పంపించారు. సాగర తీరాన అలాంటి ప్రాజెక్టు ఏర్పాటు చేస్తే పర్యావరణ ప్రభావం, అనుమతి ఇవ్వచ్చా? లేదా? అని సలహా కోరారు. కానీ ఇంకా సమాధానం రాలేదు.అక్కడి నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే తప్ప ఇక్కడ పనులు ప్రారంభమయ్యే అవకాశం లేదు. అయితే ఇలాంటి అనుమతులు పొందాలంటే ఆ అధికారులను కలిసి ఒప్పించాల్సి ఉంటుందని, వీఎంఆర్‌డీఏ అధికారులకు అంత తీరక లేక వెళ్లడం లేదని తెలుస్తోంది. ఇప్పటికే ఏడాది దాటింది. మరికొంత కాలం గడిస్తే ప్రాజెక్టు విషయాన్ని అందరూ మరచిపోతారు. కమిషనర్లు మారితే పాత ప్రాజెక్టులకొనసాగింపు, పునరుద్ధరణపై వీఎంఆర్‌డీఏ ఎప్పుడూ దృష్టి పెట్టడం లేదు.దీంతో ఇది కూడా కాలగర్భంలో కలిసిపోతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

స్కూల్ కమిటీ ఎన్నికలకు ఈసీ గ్రీన్ సిగ్నల్

... 5వ పేజీ తరువాయి

నిర్వహించనున్నారు. ఎన్నిక నిర్వహించాలంటే ప్రతి పాఠశాలలో 50 శాతం మంది తల్లిదండ్రులు హాజరుకావాలి. అంతకంటే తక్కువగా హాజరైతే కోరం లేదని వాయిదా వేస్తారు. ప్రతి తరగతి నుంచి ముగ్గురు సభ్యులను ఎన్నుకుంటారు. ఎన్నిక అనివార్యమైతే ప్రతి తరగతిలోని విద్యార్థుల తల్లిదండ్రులు చేతులెత్తి సభ్యులను ఎన్నుకునే విధానం అమలుచేస్తారు. తరువాత సభ్యులు అంతా కలిసి చైర్మన్, వైస్‌చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కమిటీకి మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. ప్రాథమిక పాఠశాలలో 15 మందితో కమిటీ ఉంటుంది. యూపీ పాఠశాలలో ఒకటి నుంచి ఏడోతరగతి వరకు ఉంటే 21 మంది, ఎనిమిదోతరగతి ఉంటే 24 మందితో కమిటీ ఏర్పాటవుతుంది. మూడోతరగతి నుంచి పదోతరగతి వరకు ఉన్న పాఠశాలల్లో 24 మంది, ఆరో తరగతి నుంచి పది వరకు ఉంటే 15 మందితో కమిటీ ఏర్పడుతుంది. పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులకు జిల్లా విద్యాశాఖ లేఖ రాసింది. పెద్ద పాఠశాలల్లో బందోబస్తు అవసరమని ప్రతిపాదించింది. ఎన్నికల నిర్వహణను ప్రతి మండలంలో తహసీల్దారు, ఎంపీడీవోలు పర్యవేక్షించనున్నారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లుచేశామని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. పాఠశాల ల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారులకు ఇప్పటికే సూచనలు జారీ చేశామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

డీఎంఈ కార్యాలయానికి కేజీహెచ్ పంచాయితీ

... 5వ పేజీ తరువాయి

కేజీహెచ్‌కు వెళ్లారని, ఉత్తర్వులు విడుదల కాకముందే అలా చెప్పాల్సిన అవసరం ఏమిటనే దానిపై ఆ అధికారిని వివరణ కోరినట్టు తెలిసింది. ఇదిలా, ఉండగా డాక్టర్ అశోక్‌కుమార్ విజయవాడ వెళ్లి డీఎంఈతోపాటు ఇతర ఉన్నతాధికారులను కలిశారని, సెలవులు ముగిసిన నేపథ్యంలో విధుల్లో చేరతానని, ఈ మేరకు మెయిల్ చేసిన వివరాలు చర్చించినట్టు చెబుతున్నారు. అయితే అశోక్‌కుమార్‌కు మళ్లీ కేజీహెచ్ బాధ్యతలను అప్పగిస్తారా..? లేక మరోచోట నియమిస్తారా, అతనిపై ఉన్న కేసు విచారణ పూర్తయ్యే వరకు పెండింగ్‌లో పెడతారా..? అనేది తేలాల్సి ఉంది.



ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భీమునిపట్నం, ఆగస్టు 7 : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీలో ప్రవేశానికి ఆసక్తి గల వారు ఈనెల 12వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ విష్ణుమూర్తి తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్గానిక్ కెమిస్ట్రీలో 30 సీట్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన వారు గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

అగ్ని ప్రమాద బాధితుడికి సాయం

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 7 : మండలంలోని మజ్జివలస ఎస్సీ కాలనీలో అగ్ని ప్రమాద బాధితుడు బోని త్రినాథరావు కుటుంబానికి బుధవారం పలువురు సాయం అందించారు. గ్రామ సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి, అప్పలరాజు నెల రోజులకు సరిపడ నిత్యావసర సామగ్రి ఇవ్వగా అదే గ్రామానికి చెందిన అప్పలసూరి, సురేష్, శ్రీను తదితరులు ఆర్థిక సాయం చేశారు. ప్రభుత్వపరంగా రెవెన్యూ అధికారులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు

ఆరిలోవ, ఆగస్టు 7 : చినగదిలి నార్త్ నార్ షిర్డీ సాయి ఆలయం సముదాయంలో ఉన్న అయ్యప్పస్వామికి జన్మ నక్షత్రం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు నెయ్యి, విభూతితో పాటు పలు రకాల పండ్ల రసాలతో స్వామివారికి అభిషేకాలు చేశారు. అనంతరం స్వామిని నూత వస్త్రాలతో అలంకరించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

భీమునిపట్నం (రూరల్), ఆగస్టు 7 : కృష్ణంరాజుపేట ప్రాథమిక పాఠశాలలో విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం జి. సత్యనారాయణ, ఉపాధ్యాయులు ఠాగూర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు.

ఆనందపురం : రవీంద్రనాథ్ ఠాగూర్ సాహిత్యంలో దిట్ట అని వేములవలస పంచాయతీ ఉప సర్పంచ్ కోరాడ నవీన్ జ్ఞానేశ్వర్ అన్నారు. బుధవారం ఠాగూర్ వర్ధంతి సందర్భంగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె. సుభాషిణి, లక్ష్మణరావు, టి. పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

తగరపువలస, ఆగస్టు 7 : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎస్ఐ చిరంజీవిరావు ట్రాఫిక్ నిబంధనలపై బుధవారం అవగాహన కల్పించారు. రోడ్డు దాటేటప్పుడు పాటించాల్సిన జాగ్రత్తలు, గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. హెచ్ఎం మురళీమోహనరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

మందుబాబులకు జరిమానా

ఆనందపురం, ఆగస్టు 7: ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి కోర్టు భారీ జరిమానా విధించింది. స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 14 మందిపై పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. ఈమేరకు భీమిలి 15వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ డి. సౌజన్య ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున రూ. 1.40 లక్షలు జరిమానా విధించారు.

ఆనందపురం ఎంఈవోగా రవీంద్రబాబు

ఆనందపురం, ఆగస్టు 7 : మండల ఎఫ్ఏసీ ఎంఈఓగా రవీంద్రబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు పని చేసిన ఎంఈవో పద్మావతి ఇటీవల పదవీ విరమణ చేయడంతో చినగదిలి ఎంఈవోగా పని చేస్తున్న రవీంద్రబాబు ఇక్కడకు బదిలీపై వచ్చారు.

రెండిళ్లలో చోరీ

కొమ్మాది, ఆగస్టు 7 : పీఎంపాలెం కాలనీలో మంగళవారం రాత్రి రెండిళ్లల్లో చోరీ జరిగింది. ఆఖరి బస్టాప్ వద్ద ఉన్న సిద్ధార్థనగర్‌లోని వైష్ణవీ హిల్స్ అపార్టుమెంట్‌లో రెండు, నాలుగో ఫ్లోర్‌లో ఇళ్ల ముందున్న ఇనుప గ్రిల్స్ కట్ చేసి దొంగతనానికి ప్రయత్నించారు. ఆయా ఇళ్ల యజమానులు విదేశాలకు వెళ్లడంతో ఆ ఇళ్లను టార్గెట్ చేశారు. బీరువాల్లో ఉన్న దుస్తులను చిందరవందరగా పడేసి విలువైన వస్తువుల కోసం గాలించారు. ఇంటి యజమానులు విదేశాలకు వెళ్లే ముందు బంగారు వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరచడంతో విలువైన వస్తువులు చోరీ కాలేదు. బుధవారం ఉదయం అపార్టుమెంట్ వాచ్‌మెన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ అప్పారావు ఆ ఇళ్లను పరిశీలించారు.

సినిమా గైడ్

● **శివం భజే :** మెలోడి, శరత్, శ్రీలక్ష్మీనరసింహ (104 ఏరియా), సుకన్య (గోపాలపట్నం), లక్ష్మీకాంత్ (గాజువాక),
● **రాయన్ :** జగదాంబ, సంగం, వెంకటేశ్వర, కిన్నెర, ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య-2 (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), రాములమ్మ (తగరపువలస)
● **పురుషోత్తముడు :** శ్రీకన్య, రమాదేవి, శ్రీనరసింహ (గోపాలపట్నం), తాతా (తగరపువలస)
● **ఆపరేషన్ రావణ్ :** రమాదేవి, సౌజన్య (గోపాలపట్నం), విశేష్ (గాజువాక)
● **కల్కి :** శ్రీరామ, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), కన్య (గాజువాక), నటరాజ్-2 (పెందుర్తి), సప్తగిరి(తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో/ రూ.ల్లో)

ఉల్లిపాయలు 35, టమాటా 27, వంకాయలు (తెలుపు) 52, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 18, పచ్చిమిర్చి 50, కాకరకాయలు 42, బీరకాయలు 38, ఆనపకాయలు 17, కాలీఫ్లవర్ 38, క్యాబేజి 30, క్యారెట్ 32, దొండకాయలు 26, బంగాళదుంపలు 36, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 52, అల్లం (పాతది) 150, బరబటి 28, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 75, గోరుచిక్కుడు 40, దోస కాయలు 18, వెల్లుల్లి (పెద్దవి) 190, కొబ్బరికాయ (పెద్దది) 23, బీన్స్ (పెన్సిల్) 72, పొటల్స్ 30, కీరదోస 30, కాప్సికమ్ 60, పొట్లకాయ (పెద్దది) 20, చేమదుంపలు 42, చిలగడదుంపలు 44, కంద 64, దేముడు చిక్కుడు 80, కొండఉసిరి 75, కరివేపాకు (కిలో) 35, కొత్తిమీర (పెద్దకట్ట) 20, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 34, తోటకూర (కట్ట) 3, మామిడికాయలు 60, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 28, మామిడి అల్లం 70, బొప్పాయి 30, జామకాయలు (కిలో) 48.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

చికెన్ ధరలు

బ్యాగ్

రైతు ధర	--	75
ఫారం ధర	--	95
విత్ స్కిన్	--	160
స్కిన్‌లెస్	--	170

మరికొన్ని సిటీ వార్తలు పేజీ Iలో..

స్కూల్ కమిటీ ఎన్నికల్లో సత్తా చూపండి

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు


సమావేశంలో మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

భీమునిపట్నం, ఆగస్టు 7 : నియోజకవర్గంలో గురువారం జరిగే పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికల్లో నూటికి నూరు శాతం గెలుపొందాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చెప్పారు. బుధవారం రాత్రి ఆయన నగరంలోని ఎంవీపీ కాలనీలో ఉన్న తన నివాసంలో నియోజకవర్గానికి చెందిన కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలను అభివృద్ధి చేసి విద్యా రంగాన్ని పటిష్ఠం చేయడానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి వుందన్నారు. ప్రతి పాఠశాలలోనూ విద్యా కమిటీలను కూటమి నాయకులు కైవసం చేసుకోవడానికి తగు ప్రయత్నం చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం సంస్కరణల పేరుతో విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నంబరు వన్‌గా తీర్చిదిద్దుతారన్న నమ్మకంతో ప్రజలు తమ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చారన్నారు. వైసీపీ పతనం దిశగా పయనిస్తోందని, రాష్ట్రంలో జరిగే ఏ ఎన్నికల్లోనూ ఆ పార్టీ గెలువబోదని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా, శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా చూడాలని, వైసీపీ కుట్ర రాజకీయాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సమావేశంలో కూటమి నాయకులు కోరాడ రాజబాబు, చిక్కాల విజయ్‌బాబు, శేఖరి శ్రీనివాస్, కంటుభుక్త రామానాయుడు, పాల్గొన్నారు.

భీమిలిలో ఒకరికి డెంగ్యూ?

భీమునిపట్నం, ఆగస్టు 7 : పట్టణంలో ఓ వ్యక్తి డెంగ్యూ జ్వరంతో బాధపడుతున్నట్టు తెలిసింది. జీవీఎంసీ జోనల్ కార్యాలయం పారిశుధ్య విభాగంలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్న ఆయన స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రతిరోజూ విధులకు వెళుతున్నారు. రెల్లివీధికి చెందిన ఆయనకు జ్వరం, తీవ్ర తలనొప్పి, నీరసం వుండడంతో ఐదు రోజుల క్రితం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్ష చేయించుకున్నాడు. డెంగ్యూ జ్వరం ఉన్నట్టు నిర్ధారణ అయ్యింది. అలాగే చిన్నబజారు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ సిబ్బంది కూడా పరీక్ష చేసి డెంగ్యూ పాజిటివ్‌గా నిర్ధారించి, కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. అయినా ఆ వ్యక్తి చికిత్సకు వెళ్లలేదని తెలిసింది. స్థానికంగానే ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో రోజూ చికిత్స పొందుతూ విధులకు వెళ్లిపోతున్నాడు. ఈ విషయమై భీమిలి సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఫణికుమార్‌తో మాట్లాడగా పట్టణానికి చెందిన వ్యక్తికి డెంగ్యూ ఉన్న మాట వాస్తవమేనన్నారు.

గత ఐదేళ్లలో 750 మంది దళితులపై దాడులు

పెదవాల్తేరు, ఆగస్టు 7 : జాతీయ క్రైమ్ రిపోర్ట్ ప్రకారం గత ఐదేళ్లలో రాష్ట్రంలో 750 మంది దళితులపై దాడులు జరిగాయని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు గుడిసె దేవానంద్ అన్నారు. బుధవారం ఆయన నగరంలోని ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ సమావేశంలో మాట్లాడారు. దళితులపై జరిగిన దాడులపై పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, గవర్నర్‌కి, ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామని చెప్పారు. కమిషన్ స్పందించి ప్రభుత్వాన్ని నివేదిక కోరిందన్నారు. దాడులపై న్యాయ విచారణ కూడా చేపట్టి, అప్పటి అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్సీ మోర్చా అఖిల భారత కార్యదర్శి ఎస్. కుమార్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గనిరెడ్డి రాకేష్, బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర, పార్వతీపురం ఇన్‌చార్జి ప్రకాష్ రెడ్డి, ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శులు కోడూరి సంజీవరావు, కణితి విజయలక్ష్మి, చార్లెస్ మాధవీలత, మౌళి, శివ పాల్గొన్నారు.

సచివాలయం సిబ్బందిపై డీఎల్‌డీఓ ఆగ్రహం


భీమిలిలోని అప్పికొండ వీధి సచివాలయంలో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

భీమునిపట్నం, ఆగస్టు 7 : సచివాలయం సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని డీఎల్‌డీఓ లక్ష్మీపతి హెచ్చరించారు. బుధవారం ఆయన అప్పికొండవీధి, స్మిత్ వీధి, ఎగువపేట వార్డు సచివాలయాలను సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది సిబ్బంది విధుల్లో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పది రోజుల క్రితం వచ్చి పనితీరు మెరుగుపరుచుకోవాలని చెప్పినా.. సిబ్బంది వైఖరిలో మార్పు లేదన్నారు. ప్రజలకు ఏయే సేవలందిస్తున్నామో, ఆయా సేవలు పొందడానికి వారు ఏయే పత్రాలు జతపరచాలో నోటీసు బోర్డులో ఎందుకు డిస్ ప్లే చేయలేదని ప్రశ్నించారు. ప్రతిఒక్కరూ విధిగా సమయపాలన పాటించాలని సూచించారు. పనితీరు మెరుగుపరచుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సాగర్‌నగర్ : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్ సచివాలయంతో పాటు పలు సచివాలయాలను డీఎల్‌డీఓ లక్ష్మీపతి బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. సాగర్‌నగర్ సచివాలయంలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. రికార్డులు పరిశీలించి, సిబ్బంది విధి నిర్వహణలో ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గుర్తించారు. ప్రతిఒక్కరూ విధిగా నిర్ధేత సమయానికి విధులకు హాజరుకావాలని సూచించారు.

'మేయర్ రాజీనామా చేయాలి'


మాట్లాడుతున్న గాడు చిన్నికుమారిలక్ష్మి

భీమునిపట్నం, ఆగస్టు 7 : జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికల్లో పదికి పది టీడీపీ గెలవడం హర్షించదగ్గ విషయమని ఆ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 2వ వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారిలక్ష్మి అన్నారు. బుధవారం రాత్రి ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ మేయర్ గొలగాని హరి వెంకట కుమారి ఆ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలాగే గత మూడున్నరేళ్లుగా జీవీఎంసీలో జరిగిన అవినీతి, అక్రమాలపై దర్యాప్తు జరపాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో విశాఖ అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

భూ సమస్యను పరిష్కరించాలని వినతి

ఆనందపురం, ఆగస్టు 7 : మండలంలోని దళితుల అసైన్డ్ భూ సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. బుధవారం వారు తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న అసైన్డు భూముల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు బోనెల యాసెబు, సియ్యాద్రి రాంబాబు, దెమ్మెద అప్పలసూరి, జలగడుగుల శ్రీనివాస్, ప్రొఫెసర్ సుబ్బారాయుడు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా పివి విజయం పట్ల హర్షం


నరసింహాన్ని పూలమాలతో సత్కరిస్తున్న 98వ వార్డు నాయకులు

సింహాచలం, ఆగస్టు 7 : స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా బరిలో నిలిచిన 98వ వార్డు కార్పొరేటర్ పివి నరసింహం విజయం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్, భీమిలి మండల తెలుగు యువత అధ్యక్షుడు రౌతు రాం బాబు, 98వ వార్డు తెలుగుయువత కార్యదర్శి గుసిడి అవినాష్‌బాబు, వార్డు బీసీ విభాగం అధ్యక్షుడు గంగ్రెడ్డి వెంకటరమణ, నగర టీడీపీ కార్యదర్శి లండ శ్రీనివాస్, దాసరి పైడిరాజు, తదితరులు ఆనందం వ్యక్తం చేశారు.

11న పెయింటింగ్ పోటీలు

ఆరిలోవ, ఆగస్టు 7 : ప్రపంచ ఏనుగుల దినోత్సవం సందర్భంగా ఈనెల 11న జూపార్కులో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ డాక్టర్ నందనీ సలారియా తెలిపారు. బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పోటీలను ఒకటి నుంచి ఐదు, ఆరు నుంచి పది, ఇంటర్ నుంచి పీజీ వరకు మూడు విభాగాలుగా నిర్వహిస్తామని చెప్పారు. పాల్గొనేవారు చిత్రకళా సాధనాలు తీసుకురావాలన్నారు. తాము చార్టు మాత్రమే అందిస్తామన్నారు. పోటీలు ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు జరుగుతాయన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మూర్తి

భీమునిపట్నం, ఆగస్టు 7 : చేనేత కార్మికులను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విష్ణుమూర్తి అన్నారు. బుధవారం ఆ కళాశాలలో జాతీయ చేనేత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం చేనేత వస్త్రధారణతో విద్యార్థుల ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు

సాగర్‌నగర్, ఆగస్టు 7 : పెద్ద రుషికొండ బీచ్ రోడ్డు ఐటీ కూడలి వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో చినగదిలి రూరల్ తహసీల్దార్ ఆదేశాల మేరకు ఆర్ఐ ప్రవీణ్ బుధవారం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ఇక్కడి భూమిని కొందరు ఫెన్సింగ్ వేసి ఆక్రమించడంతో కలెక్టర్‌కు ఫిర్యాదు అందింది. ఆయన ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి, 700 గజాలు ప్రభుత్వ భూమిగా నిర్ధారించారు. ఈ మేరకు అక్కడ హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

ఘనంగా సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ ఆవిర్భావ దినోత్సవం

సాగర్‌నగర్, ఆగస్టు 7 : విశాలాక్షినగర్ పోలీస్ గ్రౌండ్‌లో సీఆర్‌పీఎఫ్ 198 బెటాలియన్ 17వ ఆవిర్భావ దినోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. సీషోర్ ఎన్ఎంసీ అధికారులు, డీఆర్‌జీవీజీవీ సహకారంతో ఈ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా బెటాలియన్ అధికారులు, సిబ్బంది తీరంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో సెకండ్ ఇన్ కమాండ్ పి. కిశోర్, డిప్యూటీ కమాండెంట్ వనజీవ్, సుబేదార్ మేజర్ గజేంద్రసింగ్ భాటి, పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న నటి హేమ



సింహాచలం, ఆగస్టు 7: సెల్ఫ్ రియలైజేషన్ క్లీనిక్ ఏర్పాటు చేసి పలువురికి సేవలు అందించాలని నిర్ణయించుకున్నట్టు సినీ నటి హేమ తెలిపారు. బుధవారం ఆమె వరాహలక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ సమాజంలో కొందరు మానసికంగా పలు సమస్యలతో సతమతమవుతూ డిప్రెషన్‌కు లోనవుతున్నారని, అటువంటి వారి బాధలను తెలుసుకుని చికిత్స అందించడమే తమ క్లీనిక్ లక్ష్యమన్నారు. ఇటీవల రేవ్ పార్టీపై తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. తెలంగాణ ప్రభుత్వం తనకు ఎటువంటి పరీక్షలు నిర్వహించినా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. కాగా దేవాలయ పర్యవేక్షణాధికారి వెంకట రమణ దర్శనం అనంతరం ఆమెకు వేదాశీర్వచనాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

అప్పన్న సన్నిధిలో ఆండాళ్ తిరు నక్షత్ర పూజలు



సింహాచలం, ఆగస్టు 7 : విశిష్టాద్వైత మత వ్యాపకులు ఆండాళ్ అమ్మవారి తిరు నక్షత్ర పూజలు అప్పన్న ఆలయంలో బుధవారం వేడుకగా నిర్వహించారు. మధ్యాహ్నం పవళింపు సేవ తరువాత ఉత్సవమూర్తిని ఉభయదేవరులతో, ఆండాళ్ అమ్మవారి మూర్తిని, ఆళ్వార్లతో సహా ఆస్థాన మండపంలో ప్రత్యేకంగా అలంకరించిన రజిత సింహాసనంపై అధిష్ఠింపజేశారు. ఆగమోక్తముగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించిన తరువాత పూజలు చేశారు. అధ్యాపకులు నాలాయిర దివ్య ప్రబంధంలోని పాశురాలను అనుసందానం చేశారు.

'ఎస్సీ వర్గీకరణ సరికాదు'


సమావేశంలో మాట్లాడుతున్న ప్రమోద చక్రవర్తి

కొమ్మాది, ఆగస్టు 7 : దళితుల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నిస్తున్నాయని దళిత హితకారిణి సభ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్‌పీ చక్రవర్తి ఆరోపించారు. బుధవారం ఆయన పీఎం పాలెంలో విలేకరులతో మాట్లాడారు. దళితులంతా సమష్టిగా ఉంటే ప్రమాదమని వర్గీకరణ చేశారన్నారు. మంద కృష్ణ మాదిగను వర్గీకరణ తర్వాత ఏదో స్వాతంత్ర్యం తీసుకువచ్చినట్టు రాజకీయ పార్టీలు పొగుడుతున్నాయని ఎద్దేవా చేశారు. రాజకీయ పార్టీలకు మాల కులస్తుల ఓట్లు అవసరం లేదా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో 20శాతానికి పైగా మాలలు ఉన్నారని చెప్పారు. వర్గీకరణపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అవగాహనా లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మాల సంఘాలను సంప్రతించి విజయవాడలో సభ నిర్వహిస్తామన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వర్గీకరణ జరగకుండా అడ్డుకుంటామన్నారు. ఆయనతో పాటు దళిత రాజకీయ వేదిక జిల్లా అధ్యక్షుడు నిడిగట్టు నాగరాజు, మాల మహానాడు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజారావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈశ్వరరావు ఉన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బొత్స సత్యన్నారాయణ

ఎమ్మెల్సీగా బొత్సను గెలిపించండి : ముత్తంశెట్టి

ఆనందపురం, ఆగస్టు 7 : స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా మాజీ మంత్రి బొత్స సత్యనారాయణను గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. బుధవారం బోయపాలెం సమీపంలోని ఈట్స్ అండ్ ట్రీట్స్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికపై వైసీపీ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత జగన్ ఉమ్మడి విశాఖ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థిగా బొత్స సత్యన్నారాయణను ఎంపిక చేశారన్నారు. జిల్లాలో 841 ప్రజాప్రతినిధుల ఓట్లు ఉండగా, అందులో అధికంగా వైసీపీకి చెందిన వారే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులుగా ఉండడంతో ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి బొత్స సత్యన్నారాయణ మాట్లాడుతూ ఏ రంగంలోనైనా గెలుపోటములు సహజమని గతానికి మరపే రాబోయే విజయమన్నారు. అది దృష్టిలో పెట్టుకుని తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, స్థానిక నాయకులు బంక సత్యన్నారాయణ, మజ్జి వెంకటరావు, కోరాడ వెంకటరావు, పాండ్రంకి శ్రీను, మూడు మండలాల నాయకులు పాల్గొన్నారు,

ఐపీఆర్‌లో పీజీ డిప్లమా కోర్సు ప్రారంభం

వెంకోజీపాలెం, ఆగస్టు 7 : ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ - ఐపీఆర్‌లో పీజీ డిప్లమా కోర్సును ఏయూ ప్రారంభించింది. ఏడాది కాల వ్యవధితో నిర్వహించే ఈ కోర్సును హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తారు.ఈమేరకు ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య జి. శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. కిషోర్‌బాబులు వర్చువల్ విధానంలో బుధవారం ఈ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐపీఆర్ ప్రొఫెసర్ డాక్టర్ హెచ్. పురుషోత్తం మాట్లాడుతూ ఈ కోర్సుకు ఇప్పటివరకు 54 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని, 13 రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు, నలుగురు విదేశీ విద్యార్థులు ప్రవేశం పొందారన్నారు.అధిక శాతం మంది వైద్యులు, న్యాయవాదులు, పరిశోధకులు, ఉన్నత విద్యావంతులు ఉన్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోవెల్ పేటెంట్ సర్వీసెస్ లిమిటెడ్ డైరెక్టర్ పి. మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాలను పరిశీలించిన ఏయూ రిజిస్ట్రార్

వెంకోజీపాలెం, ఆగస్టు 7 : ఏయూ దూరవిద్య కేంద్రానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలను రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. కిషోర్‌బాబు బుధవారం పరిశీలించారు. ఏయూ స్థలం కబ్జాకు గురవుతోందని సమాచారం రావడంతో మంగళవారం అర్ధరాత్రి ఇంజనీరింగ్ సిబ్బందిని అక్కడకు పంపి వివరాలు తెలుసుకున్నారు. ఉదయం రిజిస్ట్రార్ స్వయంగా ఆ స్థలాలను పరిశీలించారు. స్థలం ఎటువంటి ఆక్రమణకు గురవ్వలేదని గుర్తించారు. పలుచోట్ల ప్రహరీ దెబ్బతినడంతో వెంటనే పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ సిబ్బందిని ఆదేశించారు.

వచ్చే నెల 1 నుంచి పశుగణన


పశుగణన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేడీ రామకృష్ణ

ఆరిలోవ, ఆగస్టు 7 : వచ్చేనెల 1వ తేదీ నుంచి పశుగణన చేపట్టనున్నట్టు పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ తెలిపారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో పశుగణనకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఉన్న పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్లను లెక్కించి, వాటి నుంచి వస్తున్న సంపాదనను నమోదు చేయాలన్నారు. ఇందుకు 150 మంది సిబ్బందిని నియమించినట్టు చెప్పారు.

ఆధార్ కేంద్రం ఏర్పాటు చేయాలి : సీఐటీయూ

పద్మనాభం (రూరల్), ఆగస్టు 7 : మండల కేంద్రంలో ఆధార్ కేంద్రం లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు తక్షణమే ఆధార్ కేంద్రాన్ని పునఃప్రారంభించాలని సీఐటీయూ నాయకులు రవ్వ నరసింగరావు, పల్లా ఆదినారాయణ డిమాండ్ చేశారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో మండల కాంప్లెక్స్ ఆవరణలో ఆధార్ కేంద్రం ఉండేదని, ప్రస్తుతం దాన్ని తొలగించారన్నారు. మిగతా సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసినా.. పద్మనాభంలో ఏర్పాటు చేయకపోవడంతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

రేషన్ డీలర్లతో తహసీల్దార్ సమావేశం

పద్మనాభం (రూరల్), ఆగస్టు 7 : తహసీల్దార్ ఆనంద్‌కుమార్ బుధవారం తన కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ నిత్యావసర సరకుల పంపిణీలో ఎటువంటి సమస్య ఉన్నా.. తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో డీలర్లు రమేష్, బంగారునాయుడు బి. శ్రీనివాసరావు, సత్యనారాయణ, పి. శ్రీనివాసరావు తదితరలు పాల్గొన్నారు.

స్కూల్ కమిటీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

పద్మనాభం (రూరల్), ఆగస్టు 7 : పాఠశాలల నిర్వహణ కమిటీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంఈవో రమణ తెలిపారు. బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మండలంలో 48 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత, 9 ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీకి ఎన్నికలు జరుగుతాయన్నారు. రాజకీయ పార్టీల జోక్యం లేకుండా ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు.

పద్మనాభంలో 1841 మందికి జనసేన సభ్యత్వాలు

పద్మనాభం, ఆగస్టు 7 : మండలంలో గత 15 రోజులుగా జనసేన పార్టీ నిర్వహించిన సభ్యత్వాల నమోదులో 1841 మంది చేరారని ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కె. రామస్వామినాయుడు తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధినేత పవన్ కల్యాణ్ విధానాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని చెప్పారు.